ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : **బి.వి.ఎల్.ఎన్.రాజు**

సంపుటి : 13 | సంచిక : 03 | నవంబర్ 2007

**రమణ భాస్కర**

ఆధ్యాత్మిక మాస పత్రిక

**పేజీలు : 24**

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

**చందా**
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 10/-

చిరునామా
**రమణ భాస్కర**
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

**ఈ సంచికలో....**

హైదరాబాద్ ......... 23-09-07
జిన్నూరు .............. 30-09-07
నరసాపురం ......... 21-10-07

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-09-2007, హైదరాబాద్)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వేదాలు, ఉపనిషత్‌లు, భగవద్గీత ఇవి అన్నీ మన ప్రాచీన గ్రంథాలు. మనం ప్రాచీన గ్రంథాలను మర్చిపోతున్నాము. వేదం అనేది ఒక మహావృక్షం. మనం చెట్లు ఎందుకు వేస్తాము? ఆ చెట్లు పెద్దవి అవ్వాలి, అందులో నుండి పుష్పాలు, పిందెలు రావాలి, అందులో నుండి పండ్లు రావాలి, ఆ పండును మనం అనుభవించాలి, దానికోసమే చెట్లు పెంచుతాము. వేదం అనే మహావృక్షానికి వచ్చే పండే అద్వైతం. అద్వైతం అనేది ఒక మతం కాదు. వేదమనే మహావృక్షానికి పండు కాస్తే, ఆ పండును మనం అనుభవిస్తాము, ఆ అనుభవమే అద్వైతం అని ఆచార్యులవారు చెప్పారు. మనందరకు భక్తి అవసరమే. జీవితంలో కష్టాలు, నష్టాలు, లాభాలు, ఆపదలు అన్నీ వస్తూ ఉంటాయి, మనం ఊహించ నటువంటి పరిణామాలు వస్తాయి. వీటి అన్నింటిని తట్టుకోవటానికి భక్తి అవసరం. మనం ధనాన్ని, విద్యను ఎలా సంపాదించుకొంటున్నామో అలాగ భక్తిని సంపాదించుకోవాలి. ఎందుచేతనంటే భక్తి అనేజల కనుక ఉంటే నదికి వరదవచ్చినప్పుడు దుంగలు ఎలా కొట్టుకొనిపోతాయో అలాగ మనకు వచ్చే కష్టాలు పైన ఉపరితలంలోనే అలా తేలి వెళ్ళిపోతాయి. భక్తి ఉన్నప్పుడు అవి మనలను పెద్దగా ఇబ్బంది పెట్టవు. ప్రతీ వాడికి భక్తి అవసరం, జ్ఞానం అవసరం, వివేకం అవసరం. శివసహస్రనామాలలో శివుడి గురించి కాలహరుడు, కామహరుడు అని చెపుతారు. కామాన్ని హరిస్తాడు, కాలాన్ని హరిస్తాడు. కాలం అంటే మృత్యువు. మనకు కోరికలో నుండే కోపం,

ద్వేషం, దుఃఖం అన్నీ వస్తాయి. అందరికి సుఖం, శాంతి కావాలి కాని ఎక్కడ సుఖం లేదో, ఎక్కడ శాంతి లేదో అక్కడ సుఖంకోసం, శాంతికోసం మనం వెతుకుతున్నాము. శాంతి, సుఖం ఎక్కడైతే ఉన్నాయో అక్కడ వెదుకుతూ ఉంటే ఈనాటికి కాకపోయినా ముందు నాటికైనా అవి లభిస్తాయి. అది లేనిచోట వెదుకుచూ ఉంటే కోట్లాది సంవత్సరాలు అలా వెదికినా అది దొరకదు. మనిషికి కావలసింది సుఖం, శాంతి. మనకు బాహ్య పరిస్థితులు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేసి ఈ శరీరం మరణించేలోపు స్వతంత్రమైన ఆనందాన్ని, సుఖాన్ని మనం అనుభవంలోనికి తెచ్చుకొంటే ఇంక మనకు పునర్జన్మ లేదు. మనలో ఏదో వెలితి ఉన్నప్పడు, ఏదో కొరత ఉన్నప్పడు అది పొందాలి, ఇది పొందాలి అని అనుకొంటాము, ఇటువంటి డిజైర్ మనకు ఉన్నప్పడు తప్పనిసరిగా పునర్జన్మ వస్తుంది. అది మంచి జన్మ అవ్వవచ్చు, చెడ్డ జన్మ అవ్వవచ్చు.

మాకు చదువు ఉంది, డబ్బు ఉంది, అధికారం ఉంది, మాకు అన్నీ ఉన్నాయి, దేనికి కొరత లేదు కాని శాంతి లేదు అంటారు. అంటే వాటిలో శాంతి లేదు అని మనకు తెలుస్తోంది కదా, భగవంతుడు ఎందుకు పెట్టాడో మన లోపల మనస్సు ఒకటి పడేసాడు. మనం నేను, నేను అంటాము కదా అదే మనస్సు. ఈ శరీరం నాది, ఈ ఆస్తి నాది అని శరీరం చెప్పదు, లోపల ఉన్న మనస్సు అంటుంది. ఈ చిన్న మనస్సులో నుండే ఇంత అశాంతి, ఇంత గందరగోళం వస్తోంది. ఆ మనస్సును బాగుచేసుకోవాలనే బుద్ధి మనకు రావటంలేదు, అది దురదృష్టం, వేదాలసారం, ఉపనిషత్తులసారం, మహర్షులు, యోగులు, ఆత్మజ్ఞానం పొందిన మహాత్ములు అందరూ కూడా ఏమి చెపుతున్నారు అంటే నీకు మనోనాశనం అయ్యేవరకు లోపల నున్న సుఖం నీకు స్వరూపంగా వ్యక్తం కాదు. సొమ్ము నీదే కాని నీ చేతికి అందటం లేదు. నీ హృదయంలో శాంతి ఉంది కాని అది నీ చేతికి అందటం లేదు. పెద్దలందరూ చెప్పేది ఏమిటి అంటే ఏ మనస్సుతో అయితే నీవు తాదాత్మ్యం పొందుతున్నావో, ఏ మనస్సును అయితే నేను అనుకొంటున్నావో అది నశించేవరకు లోపల ఉన్న సుఖం, శాంతి నీకు స్వరూపంగా వ్యక్తం కాదు. అది నీకు వ్యక్తమయ్యేవరకు నీకు స్వేచ్ఛలేదు, సుఖంలేదు, బంధం తప్పదు. జీవుడిని దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్ళటం కోసం అనేక మంది మహాత్ములు అనేకరకాలుగా చెప్పారు. మనోనాశనం ఎలా చెయ్యాలి అని వాసుదేవ స్వామి గీతలో ఒక ప్రణాళికాబద్ధంగా చెప్పాడు. మనందరం భగవద్గీతను మర్చిపోయాము.

మనది వైదికమతం, ఎవరో ఒక వ్యక్తి స్థాపించినది కాదు, ఇది ఒక సనాతన ధర్మం. నువ్వు ఎలా జీవించాలి, నీ ప్రవర్తన ఎలా ఉండాలి అనేది వివరంగా పరమాత్మ చెప్పాడు. ధర్మ, అర్థ, కామ, మోక్షములు నాలుగు పురుషార్థములు. ఇందులో మొదట ధర్మం పెట్టాడు, చివర మోక్షం పెట్టాడు. అర్థకామములను మధ్యలో బిగించాడు. అర్థకామములు విచ్చలవిడిగా ఉండకూడదు. డబ్బు సంపాదించుకోవచ్చు అది ధర్మబద్ధంగా ఉండాలి. పూర్వం కంటే ఇప్పుడు ఖర్చులు పెరిగి పోయాయి. చాలా విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. ఖర్చులు పెరిగే కొలది ధర్మవిరుద్ధంగా సంపాదించాలనే బుద్ధి కలుగుతుంది. ధర్మవిరుద్ధంకాని కోరిక, ధర్మవిరుద్ధంకాని సంపాదన కూడా నేను అని భగవంతుడు చెప్పాడు. అన్నింటికంటే ముఖ్యమైన పురుషార్థం మోక్షం. మోక్షం అంటే విడుదల. దేనిలో నుండి విడుదల? మనం ఏదైతే కాదో అది అవును అనుకొంటున్నాము, దానిలో నుండి విడుదల.

హిందూమతంలో పూజలకు ఎక్కువ ప్రాముఖ్యత పెరిగిపోయింది. పూజ, జపం, ధ్యానం అవసరమే, ఇవి అన్నీ ఎందుకు పెట్టారు అంటే మనస్సును నియమించుకోవటానికి పెట్టారు. అయితే హృదయంలో ఉన్న ఆనందాన్ని అందుకోవటానికి పూజ, జపం, ధ్యానం సరిపోవు. కర్మానుష్టానం ఉండాలి. మనం పిహెచ్‌డి చేయాలంటే గైడ్‌ను పెట్టుకొంటాము. ఇప్పుడు పిహెచ్‌డి చేయడం తగ్గిపోయింది. ఎప్పుడు చదువు పూర్తి చేసేద్దాము, ఎప్పుడు డబ్బు సంపాదించేద్దాము అని చూస్తున్నారు. పిహెచ్‌డి 3 సంవత్సరాలు చేయటం వలన అదనంగా వచ్చేది ఏముంది అనుకొంటున్నారు. స్టూడెంట్స్ మనస్తత్వం, తల్లి తండ్రుల మనస్తత్వం కూడా అలాగే ఉంది, చదువు అనేది కేవలం పొట్టకోసమే అనే భావన ఉంది కాని మనో వికాశానికి చదువు ఉపయోగపడుతుంది అనే భావన తగ్గిపోయింది. వివేకానంద ఒకమాట చెప్పాడు. నేను చాలా దేశాలు చూసాను. చదువులేనివారికంటే చదువు ఉన్న వారిలోనే ఎక్కువ స్వార్థపరులు ఉన్నారు అని స్వామీజీ చెప్పారు. వాడు ఎంత పండితుడు అయినా, వాడికి ఎంత ధనం ఉన్నా, స్వార్థం ఉన్నవాడు పవిత్రుడు కాలేడు. ఒక మనిషిని కొలిచేటప్పుడు వాడి ఆస్తి, కీర్తి, అధికారం ఇవి ఏమీ చూడకండి. ఇవి అన్నీ బాహ్యమైన విషయాలు. అంతరంగా ఎలా ఉన్నాడు, పది మంది క్షేమం కోరుతున్నాడా, సమాజానికి ఏమైనా సహాయం చేస్తున్నాడా, సమాజాన్ని ప్రేమిస్తున్నాడా అనేది చూడండి అని చెప్పాడు. ప్రతీ జ్ఞాని కూడా సముద్రంలాంటివాడు. నదులు మహాప్రవాహంగా వెళ్ళి సముద్రంలో కలిసినా సముద్రానికి వచ్చే లాభంలేదు, నదులు కలవకపోయినా సముద్రానికి వచ్చే నష్టం లేదు. అలాగే మహాజ్ఞాని దగ్గరకు భక్తులు వెళ్ళి

కూర్చోవటం వలన వాడికి ఏమీ లాభం లేదు, వెళ్ళకపోవటం వలన వచ్చే నష్టం లేదు. వాడు ఎప్పడూ నిండుగానే ఉంటాడు, వాడికి అసలు బాహ్యప్రవృత్తే ఉండదు. అయితే మహాత్ములు పని చేస్తున్నారు, రమణుడు రామకృష్ణుడు పని చేసారు, ఎందుకు చేస్తున్నారు, ఏదైనా అవసరముండి చేస్తున్నారా అంటే ఏమీలేదు. జ్ఞాని దయాస్వరూపుడు, ప్రేమ స్వరూపుడు. మహాత్ములు బయట ఏదో పని చేస్తున్నా లోపల వారి శాంతికి భంగం ఏమీలేదు.

లోపల ఏదో బ్రహ్మపదార్థం ఉంది అంటున్నారు, ఉంటే మాకు తెలియాలి కదా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే నీ రాంగ్‌తింకింగ్‌లోనుండి, నీ రాంగ్‌హేబిట్స్‌లోనుండి నువ్వు బయటకురా. ఇప్పడే ఇక్కడే ఆ వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది, అది ప్రత్యక్షానుభవం. ప్రతీ మనిషికి వాడి యోగక్షేమాల గొడవ తప్పించి, మనలను మనం మర్చిపోయి ఎప్పడైనా ఎవరినైనా ప్రేమించామా? నిన్ను నీవు ఎలా ప్రేమించుకొంటున్నావో అలాగ కనిపిస్తున్నటువంటి ఈ సృష్టిని ప్రేమించగలగాలి. సృష్టి అంటే ఈశ్వరుడి యొక్క స్థూలరూపమే. మన హృదయంలో సత్యం ఉంది. అది ఎలా ఉండాలో అలాగ ఉంది గాని నువ్వు అనుకొన్నట్లు లేదు. అది ఎలాగ ఉందో అలాగ నీకు రివీల్ అవ్వాలంటే అది ఎంత ఇంపెర్సనల్‌గా ఉందో, అది ఎంత సింపుల్‌గా ఉందో, అది ఏ స్థాయిలో ఉందో ఆ స్థాయికి మనం ఎదిగి వచ్చినప్పడు ఒక్క క్షణం కూడా లేటు చేయకుండా అది మనకు రివీల్ అవుతుంది. ఏ వస్తువునైతే మనం తెలుసుకోవాలనుకొంటున్నామో దాని తాలుక దయ లేకుండా అది మనకు తెలియబడదు. అది నీకు ఎరుకలోనికి రావాలంటే నీకు మెచ్యూరిటీ రావాలి. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు, ఇందులో సందేహం లేదు, ఇది నిశ్చయం అని భగవంతుడు చెప్పాడు.

ప్రతీమనిషికి లోకవాసన ఉన్నంతకాలం మత్తు వస్తుంది. మంచిని చెడ్డ అనుకొంటాడు, చెడ్డను మంచి అనుకొంటాడు, నిత్యాన్ని అనిత్యం అనుకొంటాడు, అనిత్యాన్ని నిత్యం అనుకొంటాడు. మంచి చేసేవారు కూడా లోకంలో గౌరవం వస్తుంది అంటేనే చేస్తారు, వీటి అన్నింటికి కారణం లోకవాసన. ఈ లోకవాసనను మనం పోగొట్టుకోలేము. లోకంలో మంచిపనులు చేసేవారు కూడా ఈశ్వరుడి ప్రీత్యర్థం చేయరు, మంచి మంచికోసం చేయరు, ఫలితం కోసం చూస్తారు. ఇటువంటి మీకు జ్ఞానం ఇవ్వటానికి భగవంతుడు అమాయకుడా. అందరూ క్షేమంగా ఉండాలి, శాంతిగా ఉండాలి అని మనం ఏ పని

చేయము, ఇటువంటి నీకు దైవ సాక్షాత్కారమా? బజారులో చీరకొనాలంటే 100 రూపాయలు చెపితే మనం 90 రూపాయలు ఇచ్చినా ఆ చీర ఇవ్వడు, దాని మూల్యం ఎంతో మనం ఇవ్వాలి. అలాగే భగవదనుభవం పొందాలంటే దానికి చెల్లించవలసిన మూల్యం చెల్లించవలసిందే. ఆ మూల్యం ఏమిటి అంటే నేను, నాది అనే తలంపులు. బాహ్యంగా నీవు ఎంతటి వాడివైనా ఈ రెండు తలంపులలో నుండి విడుదల పొందకపోతే నీకు శాంతిలేదు, సుఖం లేదు. పదిమంది క్షేమం కోరే బుద్ధి నీకు లేనప్పుడు దైవసాక్షాత్కారం అడగటంలో అర్థం ఏమిటి? శక్తి భగవంతుడికి ఉంది కాని జీవుడికి శక్తి లేదు. అహంకారం తగ్గకుండా, మమకారం తగ్గకుండా ఎన్నడూ మీకు శాంతి రాదు అని గీతలో పరమాత్మ చెప్పాడు. ఎప్పుడైనా మన మనస్సు అణిగినప్పుడు రమణమహర్షికంటే, రామకృష్ణుడికంటే మనమే ఎక్కువ అనిపిస్తుంది. పరిస్థితులు అన్నీ బాగున్నాయి అనుకోండి, మనస్సు అణిగి ఉంది అనుకోండి, ఏదో పది రోజులు శాంతిగా ఉంటాము. అణిగిన మనస్సును ఎవరూ నమ్మకూడదు, అది ఎప్పుడైనా విజృంభించే అవకాశం ఉంది, మనస్సు నశించాలి.

నాకు ఆ పని ఉంది, నాకు ఈ పని ఉంది బిజీగా ఉన్నాను, భగవద్గీత చదవటానికి నాకు టైములేదు, పూజ చేసుకోవటానికి నాకు టైము లేదు అంటాము. నిన్ను నీవు బాగుచేసుకోవటం కంటే మించిన పని ఉందా, అది నీకు పని కాదా అని గీతలో పరమాత్మ చెప్పాడు. నీ మనస్సును బాగుచేసుకోవటం, నీ మనస్సును నియమించుకోవటం కంటే మించిన పని అంటూ ఏదైనా ఉందా. నిన్ను నీవు ఉద్ధరించుకోకుండా, ఎవరో వచ్చి ఉద్ధరిస్తారు అని కనిపెట్టుకొని ఉండవద్దు. నిన్ను నీవు ఉద్ధరించుకోవటానికి ప్రయత్నం చెయ్యి, కాలం కలిసివస్తుంది, ఈశ్వరుని దయ నీకు కలుగుతుంది, అప్పుడు తరిస్తావు. మనం ఏదైనా మాట్లాడుతూ ఉంటే కపటంతో మాట్లాడుతున్నామా, కపటం లేకుండా మాట్లాడుతున్నామా, లోపల ఏదైనా ద్వేషం పెట్టుకొని మాట్లాడుతున్నామా, ఏదైనా కోరిక పెట్టుకొని మాట్లాడుతున్నామా, కోరిక లేకుండా మాట్లాడుతున్నామా అనేది ప్రతీదీ భగవంతుడు చూస్తూ ఉంటాడు, ఆయన సర్వసాక్షి. మనకు ఏదైనా చెడు తలంపు వచ్చినా, మంచి తలంపు వచ్చినా ఇది ఎవరికి తెలియదు అని మనం అనుకొంటాము కాని భగవంతుడు మన హృదయంలో ఉండి ప్రతీదీ రికార్డు చేస్తాడు. మనం దేవాలయానికి వెళ్ళినప్పుడు మంచి బుద్ధిని ప్రసాదించు, మంచి మనస్సును ప్రసాదించు, పదిమందికి సహాయపడే నేచర్‌ను ప్రసాదించు అని భగవంతుడిని కోరుతున్నామా? లేదు. లోపల స్వార్థం పెట్టుకొని భగవంతుడిని ఏదో అడుగుతూ ఉంటాము.

మనం కాలాన్ని వృధా చేసుకోకుండా, ఎప్పుడూ భగవంతుడిని అంటిపెట్టుకొని ఉండాలి. చెట్టును అంటిపెట్టుకొని ఉంటే కాయ ముగ్గుతుంది. అలాగే మనం భగవంతుని పాదాలను అంటిపెట్టుకొని ఉంటే మనకు మెచ్యూరిటీ వస్తుంది గాని లేకపోతే రాదు. అర్జునుడు భగవంతుడు చెప్పిన మాటలు విన్నాడు. కృష్ణా నువ్వు చెప్పిన మాటలు ఎందుకు వింటున్నానో చెప్పమంటావా నాకు మోహం ఉంటే, నాలో అజ్ఞానం ఉంటే నువ్వు భగవంతుడివి అయినా నువ్వు చెప్పిన మాటలు నేను వినను. నీ విశ్వరూపం చూపించావు, నాలో మోహం తగ్గింది, దేహాభిమానం తగ్గింది కాబట్టి నువ్వు చెప్పిన మాటలు శ్రవణం చేస్తున్నాను, అంతేకాదు నువ్వు చెప్పింది ఆచరిస్తాను అని అర్జునుడు పరమాత్మకు చెప్పాడు. మన ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవటానికి, మనలను మనం సంస్కరించుకోవటానికి చేసే ప్రయత్నమే సాధన. ప్రతీ మనిషికి వాడిలోని బలహీనతలు వాడికి తెలుస్తూ ఉంటాయి, ఆ బలహీనతలను, చెడు వాసనలను తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. వాటిని భగవంతుడు మనకు ఇవ్వలేదు. ఒక టైములో అవి మంచివి అనుకొని వాటిని మనం ప్రాక్టీసు చేసాము. ఆ ప్రాక్టీసు చేసినవే మనకు వచ్చాయి. ఇదంతా దేవుడు చేసాడు, దేవుడు చేసాడు అంటాము. దేవుడికి పక్షపాతం లేదు. మనం చేసినదే మనకు ఇస్తాడు.

లోకంలో ఏదో ఉంది, లోకంలో ఏదో ఉంది అని లోకంలో తిరుగుతూ లోకవాసన పెంచుకొంటున్నాము. జ్ఞానం అనేది బయట నుండి వచ్చేదికాదు, అది లోపల నుండే రావాలి. కోపం వస్తూ ఉంటే నష్టం ఏమిటి, కోరిక వస్తూ ఉంటే నష్టం ఏమిటి, భయం వస్తూ ఉంటే నష్టం ఏమిటి అని అడుగుతున్నారు. భయం కూడా దుఃఖం ఉంటుంది, కోరిక కూడా దుఃఖం ఉంటుంది, కోపం కూడా దుఃఖం ఉంటుంది. ఇవి మూడూ ఉన్నంతసేపు ఎవడూ దుఃఖరహిత స్థితిని పొందలేడు. అందుచేత ఏదో మామూలుగా ప్రయత్నం చేయటంకాదు, శక్తివంచన లేకుండా ప్రయత్నం చేసి, సర్వవిధములుగా ప్రయత్నం చేసి, భక్తిమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం ఇలా నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చేసి లేకపోతే అన్ని మార్గములను సమన్వయం చేసుకొని ప్రయత్నం చేసి ఈ మూడింటిలో నుండి విడుదలపొందు. శరీరం కూడా నీడ ఎలా వెంటాడుతుందో అలాగ ఈ మూడు ఉన్నంతసేపు నిన్ను దుఃఖం, అశాంతి వెంటాడతాయి. అందుచేత అన్నివిధములుగా ప్రయత్నం చేసి, భగవంతుని పాదాలను ఆశ్రయించి, ఈ మూడింటిలో నుండి విడుదల పొందితే భగవంతుడిలో ఐక్యమవుతావు, అదే మన జీవిత గమ్యం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-09-2007, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు భక్తి ఉంటే, మనకు శ్రద్ధ ఉంటే మనం తరించటానికి నారాయణ అనే నాలుగు అక్షరాలు సరిపోతాయి. ఈ సృష్టిని నియమించేవాడు, ఈ సృష్టిని అంతా పరిపాలించేవాడు భగవంతుడు ఒక్కడే, వాడే నారాయణుడు. ఆయనే మన హృదయంలో అంతర్యామిగా ఉన్నాడు, ఈ సృష్టి అంతా కూడా వ్యాపించి ఉన్నాడు. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే మీ అందరి గురించి నాకు తెలుసు, మీ పూర్వజన్మలు తెలుసు, రాబోయే జన్మలు తెలుసు. అర్జునా! నీకు నాకు తేడా ఒక్కటే ఇది అంతా నాకు తెలుసు, నీకు తెలియదు అని పరమాత్మ చెప్పాడు. వారు అలా చేసారు ఇలా జరిగింది, వీరు ఇలా చేసారు అలాగ జరిగింది అని పొంబై అనుకొంటాము కాని అవి అన్నీ నిజాలు కాదు. ఈ సృష్టిలో ప్రతీదీ భగవంతుని సంకల్పం ప్రకారం జరుగుతుంది. మనకు మంచి జరిగినా, చెడు జరిగినా అంతా భగవంతుని సంకల్పం ప్రకారం జరుగుతోంది. ఈ శరీరంలో ప్రాణం పోసినవాడు భగవంతుడే, మరల ఈ శరీరం నుండి ప్రాణం తీసేవాడు భగవంతుడే. ఆయన పాదాల దగ్గరకు చేరేవరకు, ఈ జీవుడు ఆయనలో ఐక్యం అయ్యేవరకు ఇలా ప్రాణం పోస్తూ ఉంటాడు, తీస్తూ ఉంటాడు, వాడే భగవంతుడు. కర్మ సిద్ధాంతాలు, కర్మసూత్రాలు ఇవి అన్నీ కింది కోర్టులో చెప్పే తీర్పులవంటివి, భగవంతుని సంకల్పం సుప్రీంకోర్టు తీర్పు, అది ఫైనల్, ఇంక దానికి తిరుగులేదు.

నా భర్త యాక్సిడెంట్‌లో చనిపోయారు, నాకు దుఃఖంగా ఉందని చెపుతున్నారు. శరీరం పుట్టింది అంటే చనిపోతుంది. ఆ చనిపోయే రోజు మనకు తెలియదు. ఇదే చివరి శ్వాస అని మనకు తెలియదు, మరల గాలి పీల్చుకొంటాము అని అనుకొంటాము గాని ఇదే చివరి శ్వాస అని మనకు తెలియదు. జీవితంలో మొదటి శ్వాస మనకు తెలియదు, చివరి శ్వాస మనకు తెలియదు. మన జీవితాలు అన్నీ తీసేసిన సినిమాల వంటివి. ఇప్పుడు సినిమాలు చూడండి, అవి హైదరాబాద్‌లో తీస్తారు, మనకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఇక్కడ ఆడతాయి. ఇష్టమైనవారు చూస్తారు, ఇష్టంలేనివారు మానేస్తారు, ఆ సినిమా ఆడేసి వెళ్ళిపోతుంది. మన జీవితాలు కూడా అంతే. మనం ఈ ప్రపంచం అనే తెరమీదకు వచ్చాము. ఇది ఒక సినిమా. మన శరీరం ఏ పనిమీద అయితే వచ్చిందో ఆ పని ఇతరులు ఇష్టపడినా, ఇష్టపడకపోయినా ఆ పని చేసుకొని చనిపోతాము. శరీరం అనేది ఒక వేషం. నాటకం ఆడేటప్పుడు చూడండి ఏ

వేషం అవసరమో ఆ వేషం వేసి స్టేజి మీదకు ఎక్కిస్తారు, నాటకం అయిపోయిన తరువాత వాడు దిగిపోతాడు. నాటకంలో వేసిన బట్టలు వాడి సొంతం కాదు, నాటకం వేయించేవాడే ఇస్తాడు, తరువాత తీసేసుకొంటాడు. అలాగే ఈ శరీరం అనే బట్టను భగవంతుడు ఇచ్చాడు. మనం ఈ ప్రపంచంలోనికి ఎందుకు వచ్చామో ఆనాటకం పూర్తి అయిన వెంటనే భగవంతుడు తీసేసుకుంటాడు, అదే శరీరం చనిపోవటం. మనకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా మన సంకల్పాలతో సంబంధం లేకుండా జరిగే సంఘటన ఇది.

భగవంతుడు చెప్పిన మాటలు మనకు ఎందుకు అర్థమవ్వటం లేదు అంటే మనకు పవిత్రత లేదు, శ్రద్ధ లేదు, ఏకాగ్రత లేదు, భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడని విశ్వాసం లేదు. భగవంతుడు అతని సమాధి స్థితిలో శరీరం ధరిస్తాడు, సమాధిస్థితిలోనే శరీరం విడిచిపెట్టేస్తాడు. కృష్ణుడు మనకు పుట్టినట్లు, చనిపోయినట్లు అనిపిస్తుంది, అది నూటికి నూరుపాళ్ళు అబద్ధం. ఆయన సమాధి స్థితిలో ఒక దేహం ధరిస్తాడు, ఆ దేహం విడిచిపెట్టేస్తాడు. చూసేవాడికి కృష్ణుడు పుట్టాడు, చనిపోయాడు అనిపిస్తుంది కాని ఆయన పుట్టలేదు, ఆయన చనిపోలేదు. ఈ రహస్యం మీకు అర్థమైనా మిమ్మల్ని మోక్షంతో అనుగ్రహిస్తాను అని పరమాత్మ చెప్పాడు. మనం అసత్యం కోసం వెతుకుతున్నాము, సత్యం దొరకాలి అనుకొంటాము, అది నెంబర్‌వన్ తింగరతనం. కలకత్తా వెళ్ళే రైలులో కూర్చుని మద్రాసు ఎప్పుడు వస్తుందని కనిపెట్టుకొని ఉన్నాము. మనం వెదికేది అశాంతికోసం, శాంతి కావాలనుకొంటాము. మనం కోరికలు పెంచుకొంటాము. మనకు కోరికలు ఉన్నా లేకపోయినా మన కోరికలను బట్టి పని అవ్వదు, ఈశ్వరసంకల్పాన్ని బట్టి పని జరుగుతుంది, ఇది బాగా అర్థం చేసుకోండి. మన కోరికతో సంబంధం లేకుండా భగవంతుని సంకల్పాన్ని బట్టి ప్రతీదీ చావులు, పుట్టుకలు, పెళ్ళిళ్ళు, స్నేహాలు, విరోధాలు అన్నీ జరుగుతాయి. కృష్ణుడికి బంధువులు, స్నేహితులు, విరోధులు ఎవరూ లేరు. ఆయనకు స్నేహితులు ఉన్నట్లు, విరోధులు ఉన్నట్లు మనకు కనిపిస్తోంది కాని ఆయన కోణంలో చూస్తే ఎవరూ లేరు, ఆయన దేవుడు. మనం మనస్సుతో చూస్తాము కాబట్టి అలాగ అనిపిస్తుంది. ఆయన శరీరం కనిపించినప్పుడు పుట్టాడు అనుకొంటాము, ఆ శరీరం పోయినప్పుడు చనిపోయాడు అనుకొంటాము కాని ఆయన ఆయనలాగే ఉంటాడు ఆయన ఏది చేసినా సమాధిస్థితిలోనే జరుగుతుంది. పతంజలి, కృష్ణుడు సమాధి స్థితి గురించి చెప్పారు. పతంజలి చెప్పిన సమాధిస్థితిలో వాడికి స్వరూప స్మృతి ఉంటుంది, లోపల ఆనందం ఉంటుంది. పని ఆగిపోతుంది, ఇంద్రియాలు, మనస్సు, శరీరం పనిచేయవు

ఆ అనుభవంలో నుండి బయటకు వచ్చాక తాను పొందిన ఆనందాన్ని, శాంతిని చెపుతాడు. కృష్ణుడు చెప్పిన సమాధి అలాగ కాదు, తానులోపల స్వరూప స్మృతిలో ఉంటాడు, అలౌకికమైన శాంతిని, అద్భుతమైన ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటాడు. దేహం, ఇంద్రియాలు, మనస్సు పనిచేస్తూ ఉంటాయి. లోపల శాంతి ఉంటుంది, బయట పని జరిగిపోతూ ఉంటుంది.

మనం భగవంతుడి సంకల్పాన్ని అంగీకరించలేము అందుచేత మనకు దుఃఖం వస్తోంది. భగవంతుడి సంకల్పాన్ని మన సంకల్పం చేసుకొంటే మనకు దుఃఖం రాదు. మన ప్రారబ్ధాన్ని బట్టి ఇంట్లో జనం సిద్ధమవుతారు. మన వలన వారు సుఖపడాలో, కష్టపడాలో, వారి వలన మనం సుఖపడాలో, కష్టపడాలో జన్మాంతరాన్ని బట్టి నిర్ణయింపబడి ఆ మనుషులు మన ఇంటికి వస్తారు. వారికి భక్తి ఉన్నా లేకపోయినా, వారు మంచివారు అయినా కాకపోయినా వారితో కాలక్షేపం చేసి బయటకు వెళ్ళిపోవటం మంచిది. మన ప్రారబ్ధాన్ని బట్టి వారు, వారి ప్రారబ్ధాన్ని బట్టి మనం సిద్ధమవుతాము. అందుచేత ఈశ్వర స్మరణ విడిచిపెట్టకుండా, ఆయన పాదాలను విడిచిపెట్టకుండా, ఆయన కేటాయించిన పనిని చేసుకుంటూ బయటకు వెళ్ళిపోవాలి. వీటిని చూసి అశాంతి తెచ్చుకోవటానికి ఇవి అన్నీ నిజం కాదు. తపస్సు అంటే నీ శరీరాన్ని, కోరికలను, మనస్సును నియమించుకోవటం తపస్సు. భోగవాంఛను తగ్గించుకోవటానికి ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో వాడు తపస్సు చేస్తున్నట్లు గుర్తు. మనం ఎంతసేపు గొప్పలు, గౌరవాలు, ప్రతిష్టలు గురించి ఆలోచించుకొంటాము గాని అసలు భగవంతుడిని స్మరించటం లేదు, ఇదే మాయ.

ఇంట్లోవారికి మనకు ఉన్న సంబంధం తాత్కాలికమైన సంబంధం, ఈ శరీరం చనిపోతేవారు ఎవరో, మనం ఎవరో. ఈ శరీరం మారిపోతే తల్లితండ్రులు మారిపోతారు, పరిసరాలు మారిపోతాయి, అన్నీ మారిపోతాయి కాని మనలను నియమించేవాడు, మనలను పరిపాలించేవాడు అయిన భగవంతుడితో సంబంధం మాత్రం పెర్మనెంట్‌గా ఉంటుంది. నా పాదాలను చేరుకొనేవరకు, నాలో ఐక్యం అయ్యేవరకు ఈ చావుపుట్టుకలు నీకు తప్పవు అని పరమాత్మ చెప్పాడు. ఏవో బుడబుక్కల మాటలు చెప్పకోవటం వలన నీవు పునర్జన్మలో నుండి బయటకు రాలేవు. నీ శరీరంతోగాని, చావుపుట్టుకలతోగాని, ప్రపంచంతోగాని సంబంధం లేకుండా స్వతంత్రంగా, వైభవంగా ఉన్న నేను ఒకటి ఉంది, అదే పరమాత్మ, అది మన హృదయం లోను ఉంది. సూర్యుడు గాని, చంద్రుడు గాని, అగ్ని గాని నా స్వరూపాన్ని ప్రకాశింపచేయలేవు, అట్టిది నా స్థానం. ఆ స్థానానికి నీవు వచ్చేవరకు ఈ శవాలను మోయటం తప్పదు, పుణ్యపాపాలు అనుభవించటం తప్పదు. పరమాత్మ ఈ జగత్తు అంతా వ్యాపించి ఉన్నాడు. ఆయన నీ

ఇంద్రియాలకు కనబడకపోవచ్చు, నీ బుద్ధికి అందకపోవచ్చు. భగవంతుడు ఈ సృష్టి అంతా నిండి ఉన్నాడు. అందుచేత నీవు ఏపని చేసినా ఆ పని ద్వారా అంతటా వ్యాపించి ఉన్న పరమాత్మను ఆరాధిస్తే నీవు తరిస్తావు అని ఈశావ్యాస్యోపనిషత్తులో ఉంది. ఈ ఒక్క వాక్యం జ్ఞాపకం పెట్టుకొంటే చాలు అని గాంధీగారు చెప్పారు. భగవంతుడు నీకు గోచరించటం లేదు కాబట్టి ఆయన లేడు అనుకొంటున్నావు. ఆయన సృష్టి అంతా వ్యాపించి ఉన్నాడు. నీవు ఏదైనా ఒక పని చేసినా, ఒక మాట మాట్లాడినా వ్యక్తిని దృష్టిలో పెట్టుకోకుండా పరమాత్మకు అర్పించి చేస్తూ ఉంటే నీవు అన్ని విధముల భగవంతుడిలో ఐక్యమవుతావు.

అంతటా వ్యాపించి ఉన్న భగవంతుడిని దర్శించలేకపోతున్నావు కాబట్టి ఆయన అనేక అవతారాలు ధరించాడు. మనం ఆ అవతారాలకు గుడికట్టి పూజిస్తున్నాము. అక్కడ స్కూలు కట్టాము కదా ఇంక గుడి ఎందుకు అని కొంతమంది అనేవారు ఉన్నారు. ప్రపంచంలో గుడి అంటూ లేకపోతే అందరూ దేవుడిని మర్చిపోతారు. కాన్వెంట్ స్కూలో, మున్సిపల్ స్కూలో ఏదో ఒక స్కూలు లేకపోతే అసలు చదువు రాదు అలాగే ఎక్కడా గుడి లేకపోతే మనం దేవుని మర్చిపోతాము. గుడి కనబడితే లోపలకు వెళ్ళి నమస్కారం పెట్టుకొని వస్తాము, దేవుడు గుర్తుకు వస్తాడు. భగవంతుడి యొక్క ఏ నామం మీకు ఇష్టమైతే ఆ నామాన్ని స్మరించుకొంటూ ఉంటే, ఏ రూపం ఇష్టమైతే ఆ రూపాన్ని ధ్యానించుకొంటూ ఉంటే మీ నామరూపముల నుండి ఆ నామరూపములు మిమ్మల్ని విడుదల చేస్తాయి, మీరు అశాంతిలో నుండి బయటకు వస్తారు అని భాగవతంలో చెప్పాడు. ఈ జీవకోటిని తయారుచేసినవాడు పరమాత్మ, మనలను భరించేవాడు ఆయన, ఈ జీవుడికి మంచి తలంపులు ఇచ్చేవాడు ఆయన, మంచి భావన ఇచ్చేవాడు ఆయన, ఆయనలో ఐక్యం చేసుకొనేవాడు కూడా ఆయనే, మనం అంటూ అసలు లేము. ఇది మనకు అర్థమవ్వాలి. రమణాశ్రమంలో గోలక్ష్మి ఎన్నో పాలు ఇచ్చింది. అదే భగవాన్ అంటూ ఉండే వారు పూర్వజన్మలో ఏ సంబంధం లేకుండానే మనం ఇక్కడ కలుసుకున్నామా, ఈ సంబంధం మనలను మరొకచోట కలపదా. ఒకో పశువు మనం ఋణం తీర్చుకోవటానికి ఎన్ని పాలు ఇస్తుందో చెప్పలేము. భర్తకు భార్య, భార్యకు భర్త ఋణ సంబంధం. నీ బిడ్డలు ఋణ సంబంధం. ఆ ఋణం తీరిపోగానే ఒకరిని ఒకరు విడిచి బయటకు పోతాము. మనం ఎవరి దగ్గరైనా 10 రూపాయలు అప్పు తీసుకొంటే వీడు నా దగ్గర అప్పు తీసుకొన్నాడు అని లోపల అనుకొంటాడు. వాడు మనకు కనిపించినప్పుడు వీడి దగ్గర అప్పు తీసుకొన్నాము అని మనం అనుకొంటాము. వాడికి 10 రూపాయలు అప్పు తీర్చేసాము అనుకోండి. ఇంక

వాడి గొడవ మనకు ఉండదు, మన గొడవ వాడికి ఉండదు. మన కుటుంబంలో కూడా అంతే ఋణ సంబంధం తీరిపోయిన తరువాత ఒకరికి ఒకరికి సంబంధం ఉండదు. మీకు మంచి జరిగినా స్వప్నమే, చెడ్డ జరిగినా స్వప్నమే, ఒక్క పరమాత్మ తప్పించి నిజం అంటూ ఏమీలేదు. కర్మమార్గం, జ్ఞానమార్గం, ధ్యానమార్గంలలో మీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చేయండి.

మనందరకు దేహం నేను అనే బుద్ధి ఉంది. మనలను ఎవరైనా పొగిడితే సంతోషం వస్తుంది, ఎవరైనా విమర్శిస్తే దుఃఖం వస్తుంది, దానికి కారణం దేహబుద్ధి. మన లోపల ఉన్న చైతన్యానికి పొగడ్తలు అక్కరలేదు, విమర్శలు అక్కరలేదు, దానికి చావులేదు, పుట్టుకలేదు, అసలు సృష్టే లేదు దానికి. దేహం నిజంగా మనం అనుకోండి, దేహమే నేను అనుకొన్నా పరవాలేదు. దేహం అసత్యం. మనందరకు దేహం అంటే ఇష్టమేగాని ఏదో రోజు అది మనలను దగాచేసి వెళ్ళిపోతోంది, దానికి ఏదో రోగం వంపు. దేహము నేను కాదు, నేను కాని దేహాన్ని నేను అనుకొంటున్నాను కాబట్టి ఇలా ఎంతకాలం అనుకొంటానో అంతకాలం ఇలా శవాలను మోస్తూ ఉండవలసిందే. మీరు యాత్రలు చేయండి, నదులలో మునగండి, సత్సంగాలకు వెళ్ళండి, జపాలు చేయండి, ధ్యానాలు చేయండి, మంచి గ్రంథాలు చదవండి వీటి అన్నింటి యొక్క ప్రయోజనం ఏమిటి అంటే దేహాత్మభావన పోయి, బ్రహ్మాత్మభావన రావాలి. దేహము నేను అనే బుద్ధి నీకు ఎంతకాలం అయితే ఉందో అంతకాలం నిన్ను అశాంతి విడిచిపెట్టదు, దుఃఖం విడిచిపెట్టదు, లాభాలు, నష్టాలు, ఉద్రేకాలు ఇవి అన్నీ విడిచిపెట్టవు. నీవు కాని దానిని నువ్వు అనుకొన్నంతకాలం ఈ చండాలం అంతా నీవు భరించవలసిందే. నీకు 10 కోట్ల డబ్బు ఉండవచ్చు, 10 పిహెచ్‌డిలు ఉండవచ్చు, నీకు అధికారాలు ఉండవచ్చు, నిన్ను అందరూ ఊరేగించవచ్చు కాని ఇది అంతా డస్టు. నీవు కానిదానిలో నుండి నీవు విడుదల పొందేవరకు ఏది నువ్వో ఆ సద్వస్తువు నీకు తెలియబడదు. దేహాత్మబుద్ధి నశించిన వెంటనే బ్రహ్మాత్మబుద్ధి కలుగుతుంది. ఆ బ్రహ్మము నీవై ఉన్నావు. ఇప్పడు దేహము నేను అని నీవు ఎలా అనుకొంటున్నావో అప్పడు బ్రహ్మము నేను అనుకొంటావు. బ్రహ్మము నేను అనుకొనే బుద్ధి నిజమైన నేను, దేహము నేను అనుకొనే బుద్ధి అబద్ధమైన నేను. అబద్దంలోనుండి నిజంలోనికి వెళ్ళేవరకు, అజ్ఞానంలోనుండి జ్ఞానం లోనికి వెళ్ళేవరకు, చీకటిలోనుండి వెలుతురులోనికి వెళ్ళేవరకు, మృత్యువులోనుండి అమృతత్వంలోనికి వెళ్ళేవరకు ఈ సంసారం ఏ మనిషిని విడిచిపెట్టదు, ఇది నిశ్చయము. నీవు సాధన చేసి దేహాత్మబుద్ధిని నశింపచేసుకొంటే దేహాత్మబుద్ధి

నశించిన వెంటనే బ్రహ్మాత్మ బుద్ధి కలుగుతుంది. నీకు బ్రహ్మాత్మభావన ఎప్పడైతే వచ్చిందో బ్రహ్మం ఎంత శాంతిగా ఉంటుందో, ఎంత వైభవంగా ఉంటుందో, ఎంత స్వతంత్ర్యంగా ఉంటుందో నీవు కూడా అలాగ ఉండగలవు. బ్రహ్మాత్మబుద్ధి వచ్చినవాడికి దేహం ఉన్నా, దేహం లేకపోయినా ఒక్కటే. దేహం ఉండటం వలన వాడికి లాభం లేదు, దేహం పోవటం వలన వాడికి నష్టం లేదు. బ్రహ్మం అంతటా వ్యాపించి ఉంది కాబట్టి బ్రహ్మంలో ఐక్యం అయిన తరువాత నీవు కూడా అలాగే ఉంటావు.

పుణ్యపాపముల గొడవ వదిలేయండి. నీవు చేసిన పుణ్యం సుఖరూపంలో, పాపం దుఃఖరూపంలో ఖర్చుఅయి పోతుంది. ఇవి అన్నీ నీ మనస్సు కల్పించిన గొడవలే, ఇవి అన్నీ అసత్యమే ఈ మగవాళ్ళు అందరూ పురుషులు కాదు, దేహాత్మబుద్ధి ఉన్నవారు అందరూ స్త్రీలే. పురుషుడు ఒక్కడే, అదే బ్రహ్మం, ఆ పురుషుడిని పొందినవాడు తిరిగి ఈ భూమి మీదకు రానక్కరలేదు. బృందావనంలో వల్లభాచార్యుడు అనే కృష్ణభక్తుడు ఉండేవాడు. ఆయన గొప్ప పండితుడు, మహామేధావి. మీరాభాయి బృందావనం వెళ్ళినప్పడు ఆయనను కలుసుకొందామని వెళ్ళింది. కృష్ణ భక్తురాలు మీరాభాయి తమ దర్శనం కోరుకొంటోంది అని చిన్నకాగితం మీద వ్రాసి పంపింది. మేము స్త్రీలను చూడము, స్త్రీలతో సంబంధం ఉన్న వారిని కూడా చూడము అని తిరిగి కాగితం వ్రాసి పంపాడు. అప్పడు మీరాభాయి ఏమంది అంటే మీ ఆశ్రమంలో ఒక పురుషుడు ఉన్నాడా? పురుషుడు అంటే కృష్ణపరమాత్మ ఒక్కడే పురుషుడు. వల్లభాచార్యుడికి పురుషదేహం ఉంది, ఆ దేహం పట్ల నేను అనే బుద్ధి పోలేదు. మీ గురువుగారికి పాండిత్యం ఉంటే ఉండవచ్చు కాని వాడికి దేహబుద్ధి పోలేదు. నేను పురుషుడిని అనుకొంటున్నాడు. వాడు పురుషుడు కాదు అని నేను చెప్పానని చెప్ప అని మీరాభాయి అంది. అప్పడు వల్లభాచార్యుడు తప్పనాదే, నాకు ఇంకా దేహభావన పోలేదు. దేహభావన పోగొట్టటానికే భగవంతుడు మీరాభాయిని నా దగ్గరకు పంపాడు అని, ఆమెను లోపలకు రమ్మని ఆహ్వానించి నమస్కారం పెట్టాడు.

ధనం, గౌరవం, పదవి రావాలనుకొంటే రావు, మీ దేహప్రారబ్ధంలో ఉంటే వస్తాయి. ఇది అంతా మాయలోభాగమే. మీరు యాత్రలకు వెళ్ళినా, యజ్ఞాలు చేసినా, యాగాలు చేసినా, పుణ్యాలు చేసినా ఏది చేసినా దేహాత్మబుద్ధిని పోగొట్టుకొని బ్రహ్మాత్మబుద్ధిని సంపాదించటానికే, ఇది మీరు మర్చిపోవద్దు, అదే ఫైనల్. కర్మయోగం చేయమని గీతలో పరమాత్మ చెప్పాడు, అవసరం లేకపోయినా నిరంతరం ఆయన కర్మ చేసాడు అని ఒక భక్తుడు భగవాన్‌తో అంటే

నిజమే కృష్ణుడు పని చేసాడు. అహంకారం లేకుండా, కర్తృత్వం లేకుండా మనం పనిచేస్తే అది కృష్ణుడు చేసిన పనితో సమానము అవుతుంది. దేహాత్మబుద్ధిని విడిచిపెడితే అప్పుడు కృష్ణుడు చేసినట్లు నీవు చేయగలవు. దేహాన్ని నీడ ఎలా వెంటాడుతుందో అలాగ కర్తృత్వబుద్ధి ఉన్నవాడిని సుఖదుఃఖాలు వెంటాడతాయి. కర్తృత్వం ఉన్నవాడిని సుఖదుఃఖాలు విడిచిపెట్టవు. ఈశ్వరుడిలో ఐక్యం అయి నీవు పనిచేస్తే నీవు చేసే పనికి నీవు కర్తవు కాదని అనుభవం నీకు వస్తుంది. మీరు మిఠాయి తిన్నప్పుడు ఎలా ఎంజాయ్ చేస్తారో అలాగ అహంకారం లేనివాడు జీవితాన్ని ఎంజాయ్ చేస్తాడు. వాడు చేసే పనిని చాకిరి అనుకోడు, ఆ పనిని ఎంజాయ్ చేస్తాడు. చేసేపని ఆనందంగా చేస్తే ఇష్టంగా చేస్తే జీవితం ఆనందంగా ఉంటుంది. పని నొల్లుకోమని కాదు, భగవంతుడు మీకు కేటాయించిన పనిని ఎంజాయ్ చేయాలి. దేహప్రారబ్ధాన్ని ఎంజాయ్ చెయ్యి అని ఆచార్యులవారు చెప్పారు. జీవితంలో మంచి, చెడ్డ, లాభం, నష్టం, గౌరవం, అగౌరవం అన్నీ ఎదురవుతాయి, ప్రారబ్ధాన్ని బట్టి ఏది వచ్చినా ఎంజాయ్ చెయ్యి.

లోకంలో అనేకమంది బుద్ధిమంతులు ఉన్నారు. ఆ బుద్ధిమంతులతో సమానంగా మనం కూడా బుద్ధిమంతుడిగా ఉంటే సరిపోతుంది. బుద్ధిమంతుడి లక్షణం ఏమిటి అంటే వాడు శరీరాన్ని వదిలేసినప్పుడు పాపపుణ్యములను కూడా ఇక్కడే వదిలేస్తాడు. కర్తృత్వం పెట్టుకొన్నప్పుడు పాపపుణ్యములను రెండింటిని తీసుకొనిపోతాడు. భగవంతుడి సంకల్పాన్ని ఎవడైతే తన సంకల్పంగా చేసుకొంటున్నాడో ఇంక వాడికి అశాంతి లేదు. నేను అనే తలంపు ఉంటేనే పనిచేయగలము లేకుంటే లేదు అనుకొంటాము. ఒక మనిషికి దేహాత్మబుద్ధి పోయిన తరువాత ఆ దేహాన్ని ఈశ్వరుడు స్వాధీనం చేసుకొని అనంతమైన కర్మ ఆ దేహంతో చేయిస్తాడు. దేహాత్మబుద్ధి పోయిన దేహం ఉంటుంది, ఆ దేహం ద్వారా ఈశ్వరుడు పనిచేస్తాడు. ఈశ్వరుడు చేయిస్తున్నాడు కాబట్టి నేను చేస్తున్నాను అనే భావన అక్కడరాదు. ఈ శరీరం ఉండగానే మీరు ఆస్థితిని పొందాలి. మనం కాలాన్ని పాడుచేసుకోకూడదు, సజ్జనసాంగత్యం విడిచిపెట్టవద్దు. లౌకికులకు దూరంగా ఉండాలి. లౌకికుల దగ్గర కపటం ఉంటుంది. రామకృష్ణ పరమహంస పెద్దపండితుడు కాదు కాని ఆయన మాటలోకాని, చేతలోగాని, తలంపులోగాని కపటం లేదు, అందుచేత ఆయన లోకానికి గురువు అయ్యాడు. సబ్జక్టును బాగా అర్థం చేసుకోండి. ఏ పని నిమిత్తం ఈ దేహాన్ని భగవంతుడు తయారుచేసాడో నీకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా ఆ పని పూర్తి అయిన వెంటనే ఈ శరీరం శవం అయిపోతుంది. దేహం నేను అనే బుద్ధి పోయింది అనుకో అప్పుడు నీవు మంచి పని చేస్తున్నా, చెడ్డ పని చేస్తున్నా నేను చేస్తున్నాను అనే భావన

నీకు ఉండదు. నేను చేస్తున్నాను అనే భావన ఎప్పుడైతే పోయిందో నీలో ఎంత దుఃఖం ఉన్నా అప్పటికప్పుడు ఆ దుఃఖం అంతా వేరుతో సహా కాలిబూడిద అయిపోతుంది. ఈ చిన్న క్లూ మీరు అర్థం చేసుకోండి. ఈశ్వరుడే కర్త, నేను కర్తను కాదు అనేది అనుభవంలోనికి వస్తే నీవు చేసిన కర్మ అంతా ఇక్కడే కాలిపోతుంది, సర్వకర్మలు నశిస్తాయి. నీకు నిర్మలత్వం, నిశ్చలత్వం రావటమే కాదు దుఃఖం అంతా నశిస్తుంది. ఎక్కడైతే దుఃఖం లేదో, ఎక్కడైతే జనన మరణాలు లేవో, ఎక్కడైతే ద్వేషాలు లేవో అటువంటి పరంధామస్థానానికి ఎగిరివెళ్ళిపోతావు. భగవంతుడు ఒక్కడే. నీవు మంచి చేసినా, చెడ్డ చేసినా ఆయన సంకల్పమే నెరవేరుతుంది. ఆయన ఘటనాఘటన సమర్థుడు. జరిగే పనిని ఆపు చేయగలడు, ఇది జరగదు అనుకొన్నప్పుడు దానిని జరిపించగలడు, వాడు నారాయణుడు. మనం తరించటానికి నారాయణ స్మరణ చాలు. నీవు ఎంత, నీ జీవితం ఎంత, నీ ఆలోచన ఎంత, నీ చూపు ఎంత? నీ ఇంద్రియాలకు కనిపించటం లేదని, నీ బుద్ధి గ్రహించలేకపోతోంది అని ఈశ్వరుడు లేడు అంటావా? ఎవడి ఆధారంగా అయితే జీవిస్తున్నావో, ఎవడిలో ఐక్యం అవ్వటానికి ఋషులు అందరూ, జీవకోటి అంతా ప్రయత్నం చేస్తోందో వాడే లేడు అంటున్నావు, అది నీ పాడుబుద్ధికి గుర్తు.

ప్రపంచం వేరు, దేవుడు వేరు అని మనం అనుకొంటాము. జ్ఞానికి ప్రపంచమే దేవుడు, దేవుడే ప్రపంచం. జ్ఞాని ప్రపంచాన్ని బ్రహ్మంగానే చూస్తాడు. నీవు ప్రపంచాన్ని ప్రపంచంగా చూసినా అది బ్రహ్మమే, బ్రహ్మంగా చూసినా బ్రహ్మమే. అయితే ప్రపంచాన్ని ప్రపంచంగా చూడటం వలన నీకు రాగద్వేషాలు, పుణ్య పాపాలు, భయం, దుఃఖం అన్నీ వచ్చేస్తాయి. కోరిక లేకుండా, ద్వేషం లేకుండా నీవు పనిచేస్తూ ఉంటే నీవు గృహస్థాశ్రమంలో ఉన్నా సన్యాసితో సమానమే. ఎర్రబట్టలు కట్టుకొని కోరికతో, ద్వేషంతో పనులు చేస్తూ ఉంటే వాడు సంసారితో సమానము. కర్మ మనలను విడిచిపెట్టాలి గాని మనం కర్మను విడిచిపెట్టకూడదు. మద్రాసులో ఉండను తక్కువ జీతం వచ్చినా అరుణాచలం వచ్చేస్తాను అని వడివేలు నాతో చెప్పాడు. అలా రావద్దు నీవు చేస్తూ ఉండు అని చెప్పాను. ఇప్పుడు చాలా ఎక్కువ జీతం వస్తోంది, చుట్టాలు మాకు కొంచెం ఇవ్వకూడదా అంటున్నారు, చుట్టాలకి ద్వేషం వచ్చినా ఆశ్చర్యపడనక్కరలేదు. అది అతని ప్రయోజకత్వం కాదు, ఈశ్వరసంకల్పం ప్రకారం జరుగుతోంది, ఈ బంధువులు కూడా ఎలా ఉంటారు అంటే డబ్బు లేకపోతే అగౌరవంగా చూస్తారు, డబ్బు వస్తే సంతోషించరు ద్వేషం పెట్టుకొంటారు, అదే మాయ. ఏమీ లేకపోతే అగౌరవం, ఉంటే ద్వేషం ఇది లోకం పోకడ. లోకంలో ఉన్న వంకర్లు మనం తీయలేము. మన బుద్ధిలో ఉన్న వంకర్లు సరిచేసుకొని బయటకు

పోవాలి. మీకు అహంకారం ఉన్నా, అహంకారం లేకపోయినా మీ శరీరం ద్వారా జరగవలసిన పని జరుగుతుంది. మీరు అహంకారాన్ని విడిచిపెట్టారు అనుకోండి మీ శరీరం ద్వారా జరిగే పని మిమ్మల్ని బాధించదు, పని జరిగిపోతుంది, సుఖం శాంతి వచ్చి మిమ్మల్ని వరిస్తాయి. అహంకారం లేకుండా ఏపని చేసినా అది యోగం అవుతుంది. యోగం దేనికి అంటే భగవంతుడిలో ఐక్యం అవ్వటానికే.

విచారణ చేసి, ధ్యానం చేసి, జపాలు చేసి వీళ్ళు అందరూ ఏ స్థానాన్ని పొందుతున్నారో అహంభావన లేకుండా పనిచేసేవారు కూడా ఆ స్థానాన్నే పొందుతారు అని పరమాత్మ చెప్పాడు. వారు ఆకలితో బాధపడుతున్నారు, వీరు ఆకలితో బాధపడుతున్నారు అని నోటితో చెప్పటం వలన ఆ బాధ మనకు తెలియదు, 4 రోజులు అన్నం మానివేస్తే ఆకలిబాధ మనకు తెలుస్తుంది. అలాగే ఇతరులు దుఃఖపడుతూ ఉంటే ఆ బాధ మనకు తెలియదు, ఇతరులకు వచ్చిన దుఃఖం మనకు వచ్చినప్పడు ఆ దుఃఖం ఎంత ఇబ్బంది పెడుతుందో మనకు తెలుస్తుంది. జ్ఞానయోగం ద్వారా ఏ పరంధాముడిని పొందుతున్నారో నీవు సత్కర్మ కూడా అహంభావన లేకుండా చేస్తే అదే పరంధాముడిని పొందుతావు. జ్ఞానయోగులు పొందే స్థానం వేరు, కర్మ యోగులు పొందే స్థానం వేరు అని ఎవరైనా నీకు చెపుతూ ఉంటే చిన్నపిల్లల మాటలు ఎలా మనం పట్టించుకోమో అలాగ ఆ మాటలను కూడా పట్టించుకోవద్దు. కృష్ణుడు పనిచేయమని చెప్పిన మాట నిజమే ఎలా చేయమని చెపుతున్నాడు? నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేయమని చెప్పాడు అప్పడు పరమాత్మలో ఐక్యమవుతావు, అది కృష్ణుడు చెప్పిన పని. నీవు పని చెయ్యి, ఎలాగ చెయ్యాలో తెలుసుకొని చెయ్యి. ఆసక్తి లేకుండా పని చేయాలి, ఫలకాంక్ష ఉండకూడదు. అలాగని పని మీద విరక్తి పెట్టుకోకూడదు. తలుపు సందున పెట్టి నలిపేస్తున్నాడు. జీవుడు దేవుడిలో ఎలా ఐక్యమవ్వాలో దేవుడు జీవుడికి చెపుతున్నాడు. నోటి ద్వారా దేవుడిని ఆరాధించటం నేర్చుకొన్నావు పని ద్వారా దేవుడిని ఆరాధించటం నేర్చుకోలేదు, అది నేర్చుకొంటే నీకు జ్ఞానం కలుగుతుంది. నోటితో జ్ఞానానికి సంబంధించిన పనుల గురించి చెప్పటం, చేతితో అజ్ఞానం పనులు చేయటం ఇంక నీవు దేవుడిలో ఎలా ఐక్యమవుతావు. మనం అన్ని తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తాము గాని మన గురించి మనం తెలుసుకోవటానికి ప్రయత్నం చేయము, ఇదే గొప్ప మాయ. మనం పనికిరాని గొడవలు అన్నీ తెలుసుకొంటాము, దాని వలన ఏమీ లాభం లేదు. నీవు బాగుపడే ఉపాయం నీకు తెలియటం లేదు.

నిన్ను నీవు తెలుసుకోవటం అంటే నీవు ఏదిగా ఉన్నావో దాని తాలుక వస్తువును

తెలుసుకోవటం. నిన్ను నీవు తెలుసుకొనే వరకూ నీవు కానిదానిని నువ్వు అని అనుకొంటూ ఉంటావు. నిన్ను నీవు తెలుసుకోవటం కంటే మించిన పని ఈ లోకంలో ఏమీ లేదు. ఎవరో వచ్చి ఉద్ధరిస్తారు అని కనిపెట్టుకొని ఉండవద్దు నీ ప్రయత్నం నీవు చేసుకొంటూ ఉంటే భగవంతుని అనుగ్రహం దాని అంతట అదే వస్తుంది. కోరిక పెట్టుకొని పనిచేస్తే ఫలితం వస్తుంది, ఆ ఫలితాన్ని మీరు ఎంజాయ్ చేస్తారు, ఎంజాయ్ చేయటం వలన వాసన పడుతుంది. ఆ వాసన వలన సంసారం వస్తుంది, అది కర్మచక్రం. కోరిక, ద్వేషం లేకుండా పని చేస్తూ ఉంటే దాని వలన ఫలితం రాదనుకోకు, దాని వలన ఫలితం వస్తుంది, నీ అంతఃకరణం శుద్ధి అవుతుంది, నిర్మలం అవుతుంది. అంతఃకరణ శుద్ధి అయినప్పుడు, నిర్మలం అయినప్పుడు, నిశ్చలం అయినప్పుడు అరచేతిలో ఉన్న వస్తువు ఎంత స్పష్టంగా గోచరిస్తుందో అంత స్పష్టంగా లోపల ఉన్న పరమాత్మ ప్రతిబింబిస్తాడు, మనం భరించలేనటువంటి సుఖం, శాంతి వచ్చి మనలను వరిస్తాయి. గాంధీగారు 1921లో ధక్షణేశ్వరం వెళ్ళారు. గాంధీగారు వచ్చారు అని అక్కడకు జనం చేరారు. మీరు అందరు దేశం కోసం త్యాగం చేయండి, అందరూ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనండి అని చెప్పటానికి నేను ఇక్కడకు రాలేదు. ఎవరిని స్మరించటం వలన నేను పవిత్రుడిని అయ్యానో, ఎవరి బోధలు వినటం వలన నా బుద్ధిలోని వంకరలు పోతున్నాయో, ఎవరు అవలంభించిన బ్రహ్మచర్యాన్ని నేను ఆదర్శంగా పెట్టుకొన్నానో ఆయనకు కృతజ్ఞత చెప్పటానికి ఇక్కడకు వచ్చాను కాని మీకు బోధించటానికి రాలేదు అన్నారు. ఇప్పుడు మనం చేసే సాధనల యొక్క గమ్యం ఏమిటి? మనం చేసే ప్రయాణం ఎక్కడ నుండి ఎక్కడకు అంటే మనకు ఉన్న దేహాత్మ బుద్ధిని పోగొట్టుకోవాలి, బ్రహ్మాత్మబుద్ధిని సంపాదించుకోవాలి, అదే మన జీవితగమ్యం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-10-2007, నరసాపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేవీనవరాత్రుల సందర్భంగా అమ్మవారిని ఈ తొమ్మిదిరోజులు ఆరాధించుకొంటూ దశమి రోజున రాజరాజేశ్వరిగా అలంకరించి పూజిస్తారు. విజయదశమి రోజున ఏ పని ప్రారంభించినా శుభప్రదం అవుతుందని హిందువుల నమ్మకం. అమ్మవారి పాదాలను ఆశ్రయిస్తే మనకు జ్ఞానం కలుగుతుంది. రామకృష్ణ పరమహంసగారు మొత్తం స్త్రీలను అందరిని అమ్మగాచూసి తరించారు. మాయ చాలా రకాలుగా ఉంటుంది. అందులో ధన వ్యామోహం, స్త్రీకి పురుషుడి మీద, పురుషుడికి స్త్రీ మీద ఉన్న వ్యామోహం, దేహవాసన ఇవి అన్నీ చాలాబలంగా ఉంటాయి. వీటిలో

నుండి బయటకు రావటానికి అమ్మవారి అనుగ్రహం ఉండాలి. మనం వలను చెరువులో వేస్తే చెరువులో ఉన్నంతసేపు వలలో నీరు ఉంటుంది, బయటకు తీస్తే వలలో ఒక్క నీటిబొట్టుకూడా ఉండదు. అలాగే మీరు ఎన్ని సాధనలు చేసినా, జపం చేసినా, ధ్యానం చేసినా అమ్మవారి దయ లేకపోతే వలలో నీరులాగ ఉంటుంది. మనకు భగవంతుడి అనుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్లే, మీరు, నేను అందరం ఒక్క విషయం మర్చిపోతున్నాము. దేహాన్ని చాలా శుభ్రంగా, శుచిగా ఉంచుకొంటున్నాము. దేహం మీద దుమ్ము పడితే సబ్బుతో తోమేసుకొంటాము. దేహాన్ని శుభ్రంగా ఉంచుకోవటం మంచిదే. దేహాన్ని ఎంత శుచిగా ఉంచుకొంటున్నామో అంత శుచిగా మనస్సును ఉంచుకోవాలి అనే బుద్ధి మనకు రావటం లేదు. ఆ బుద్ధి వస్తే మనం ప్రయత్నం చేస్తాము, అసలు ఆ బుద్ధే మనకు లేదు. దేహం మీద మనకు తెలియకుండా దుమ్ము ఎలా పడిపోతుందో అలాగే మనకు తెలియకుండా మనస్సులో రాగద్వేషములు పడిపోతాయి. ఇది మహామాయ. ఈ మాయ వలన మనకు సత్యం అసత్యంలాగ, అసత్యం సత్యంలాగ కనిపిస్తుంది. అమ్మవారి అనుగ్రహం ఉంటేగాని ఇందులో నుండి మనం బయటకురాలేము.

హృదయంలో ఉన్న సత్యాన్ని కొంతమంది మహావిష్ణువుగా, కొంతమంది శివుడిగా, కొంతమంది శక్తిరూపంలో ఆరాధిస్తారు. కొంతమంది విష్ణుసహస్రనామాలు పారాయణ చేస్తారు, కొంతమంది లలితాసహస్రనామాలు పారాయణ చేస్తారు. ఇవి అన్నీ కూడా మన స్వరూపం దగ్గరకు మనలను తీసుకొనిపోతాయి, వాటి గమ్యం అదే. అమ్మవారిని దుర్గగా, సరస్వతిగా, లక్ష్మిగా ఆరాధిస్తారు. అమ్మవారిని ఆరాధించగా ఆరాధించగా మనస్సు వెళ్ళి హృదయంలో ఉన్న సత్యపదార్థంలో ఐక్యమవుతుంది. ఎవరైతే ధ్యానపూర్వకంగా ఉపాసన చేస్తున్నారో వారి మనస్సు ఆత్మలో లయమవుతుంది. అప్పుడువారు సుఖంకోసం, శాంతికోసం బజారులో పడనక్కరలేదు. ఉన్నది ఒక్కటేకాని మీరు వేరు, నేను వేరు అనే బేధబుద్ధి ఎందుకు వస్తోంది అంటే ఉపాధిని బట్టి వస్తోంది, ఇది మనకు అర్థమవ్వాలి. దేహభావన ఉన్నప్పుడు మీరు వేరు, నేను వేరు అనిపిస్తుంది కాని హృదయం దగ్గరకు వెళ్ళేటప్పటికి అందరం ఒక్కటే. ఇన్ని దేహాలలో అంతర్యామిగా ఉన్నవాడు నారాయణుడు ఒక్కడే. అయితే దేహాభిమానం వలన మనకు బేధబుద్ధి వస్తోంది. మీరు ఎవరికైనా ఉపకారం చేస్తే మీకు మీరు ఉపకారం చేసుకొన్నట్లు, ఎవరికైనా అపకారం చేస్తే మీకు మీరు అపకారం చేసుకొన్నట్లు అది మీకు తెలియకపోవటం వలన, మీరు వేరు వారు వేరు అనుకొని చేయటం వలన అన్నీ మీకు ఎదురువస్తున్నాయి అని ఉపనిషత్‌లలో

చెప్పారు. దేహాభిమానం వలన లోపల ఉన్న వస్తువు మనకు గోచరించటం లేదు. వస్తువు గోచరించకపోయినా పరవాలేదు, మీరు వేరు నేను వేరు అనే బేదబుద్ధి వలన రాగద్వేషాలు వచ్చేస్తున్నాయి. వారు నాకు స్నేహితులు, వీరు నాకు విరోధులు అని అనుకోవటం, ఇటువంటి తలంపులు మన స్వరూపానికి మనలను దూరం చేస్తాయి. ఈ తలంపులు అన్నీ బేదబుద్ధిలో నుండే వస్తున్నాయి. మీ శరీరాలు చూస్తున్నాను, మీ గుణాలను చూస్తున్నాను, మీ మనస్సును చూస్తున్నాను కాని మీలో అంతర్యామిగా ఉన్న నారాయణుడిని చూడలేకపోవటం వలన బేదబుద్ధి వస్తోంది, మిమ్మల్ని చూస్తే నాకు భయం, నన్ను చూస్తే మీకు భయం. రజోగుణం ఉన్నంతసేపు సృష్టిలో ఏమతస్థుడికైనా, ఏ కులస్థుడికైనా జ్ఞానం కలుగదు. మీకు జ్ఞానం కలిగింది అనుకోండి మీకు ఎన్ని కష్టాలు వచ్చినా నీటి ప్రవాహంలో దుంగలు ఎలా కొట్టుకొనిపోతాయో అలాగ జ్ఞానప్రవాహంలో మీ కష్టాలు అన్నీ కొట్టుకొనిపోతాయి.

ఈ విశాలమైన సృష్టిలో కొన్ని కోట్లమంది జనం ఉన్నారు. వారు మంచివారు, వీరు చెడ్డవారు అని ఇటువంటి పిచ్చిగొడవలలోనికి వెళ్ళవద్దు, అది అంతా మనలను పాలించే దేవుడు చూసుకొంటాడు. నీవు జ్ఞానం సంపాదించటం మానేసి, ఇటువంటి తీర్పుల గొడవ నీకు ఎందుకు? మనమే రాగద్వేషములతో కాలిపోతూ ఉంటే ఎదుటివారిమీద తీర్పులు ఎలా చెపుతాము. రజోగుణం పెరిగేకొలది కోరికలు పెరుగుతాయి. మనిషికి కోరికలు ఎక్కువ ఉన్నప్పుడు భగవంతుడు అసత్యం, లోకమే సత్యం అని వాడికి అనిపిస్తుంది, ఇదే మహామాయ. మన రేడియో పాడైపోతే బెజవాడ స్టేషన్ పనిచేస్తున్నా మన రేడియో రిసీవ్ చేసుకోలేదు అలాగే మన మనస్సు పాడైపోయి ఉన్నప్పుడు భగవంతుడు చెప్పిన వాక్యాన్ని రిసీవ్ చేసుకోలేదు. మీరు ఏ మార్గంలో ప్రయాణం చేసినా అంతఃకరణ శుద్ధి అవ్వకుండా ఈ సృష్టిలో ఎవడికి సిద్ధి కలుగదు. విజయదశమి రోజున షిరడీబాబా గారు శరీరం త్యాగం చేసారు. బాబాగారు పుట్టినరోజు ఎవరికి తెలియదు, ఎక్కడ పుట్టారో తెలియదు, ఆయన తల్లిదండ్రులు ఎవరో తెలియదు, రమణమహర్షిగారిని, షిరిడీబాబా గారిని శరీరంలో నుండి ప్రాణం తప్పకొన్నాక సమాధి చేసారు. జ్ఞానేశ్వర్ అలాకాదు, ప్రాణం ఉండగానే సమాధి చేసారు. ప్రాణం ఉండగా సమాధి చేస్తే ప్రాణం ఏమవుతుంది. మన ముక్కులో గాలి ఈశ్వరుడు లాక్కుపోతున్నాడు, జీవసమాధి ఎవడినైతే చేసామో వాడి గాలి వాడే లాగేసుకొంటాడు. తమిళనాడులో కరూర్ దగ్గర ఒక ఊరు ఉంది, అక్కడ సదా శివబ్రహ్మేంద్రసరస్వతి అని దిగంబర స్వామి ఉండేవారు, ఆయన జీవసమాధి పొందారు. నేను జీవసమాధి పొందాక 12వ రోజున కాశీ నుండి ఒకరు

శివలింగం తెస్తారు దానిని నా సమాధి మీద ప్రతిష్ఠించండి, సమాధి దగ్గర ఒక వృక్షం మొలుస్తుంది అని ముందుగానే ఆయన అన్నీ చెప్పారు, అలాగే జరిగింది. ఆయన శరీరం విడిచిపెట్టి సుమారు 250 సంవత్సరాలు అయింది. ఇప్పుడుకూడా మీరు అక్కడకు వెళ్ళి కూర్చుంటే మీ ప్రయత్నంతో సంబంధం లేకుండా మీరు భరించలేనంత శాంతి మీకు కలుగుతుంది, అది సదాశివబ్రహ్మేంద్రుని అనుగ్రహం. మన మనస్సును బాగుచేసుకోవటం కంటే మించిన పని ఏమీ లేదు. ఎందుచేత నంటే మరణానంతరం అది మన కూడా వచ్చేస్తుంది. మన శరీరం చనిపోయినప్పుడు మన ముక్కు, మన చెవులు, ఈ శరీరం ఏదీ మనకూడా రాదు. ఏ ఇంద్రియానికి ఏ బలహీనత ఉందో ఆ బలహీనతలు అన్నీ ప్రాణంతోపాటు వెళ్ళిపోతాయి గాని ఇక్కడ శరీరంలో ఆగవు. ఈ శరీరంలో ఉండగానే, నీ ముక్కులో గాలి బయటకు వెళ్ళకముందే ఎవడైతే కామక్రోధముల వేగం తగ్గించుకొంటున్నాడో వాడికి ఇంక ప్రయాణాలు ఆగిపోతాయి. ఈ శరీరం ఉండగా కామక్రోధములు తగ్గించుకోడు అనుకోండి అవి కొన్ని వందల జన్మలకు కారణం అవుతాయి.

మనం విష్ణు నామంగాని, అమ్మవారి నామంగాని, మనకు ఇష్టమైన భగవంతుని నామంగాని జపించగా జపించగా మనకు తెలియకుండా మనస్సు వెళ్ళి హృదయంలో పడిపోతుంది. రాగద్వేషముల పట్టునుండి మనస్సును విడిచిస్తే అది తన ఇంటికి వెళ్ళిపోతుంది అంటే మనస్సు ఎక్కడైతే ఉదయించి వచ్చిందో అక్కడకు ఉపసంహరింపబడుతుంది. మనస్సుకు యోగ్యత వచ్చినప్పుడు, మెచ్యూరిటీ వచ్చినప్పుడు అది హృదయం లోనికి ఉపసంహరింపబడి, అక్కడ స్థిరపడిపోతుంది. మనస్సు హృదయంలో స్థిరపడటం వలన ఏదైనా వాసనలు బీజరూపంలో ఉన్నా అవి నెమ్మదిగా కాలిబూడిద అయిపోతాయి, అదే కడసారి జన్మ. శరీరం బతికి ఉండగా సాధన చేసి మనం అభివృద్ధిలోనికి రావాలి కాని శరీరం చనిపోయాక అనుభవించే లోకాలే గాని సాధనకు పనికి వచ్చే లోకాలు ఏమీ లేవు. అందుచేత కాలాన్ని పాడుచేసుకోవద్దు. మీ దేహయాత్రకు సరిపడ పనులు చేసుకోండి, మిగతా టైములో భగవంతుని ప్రీత్యర్థం పనులు చేయండి. దేవునికి పుష్పాలతో ఎలా అర్చన చేస్తున్నామో అలాగ మన మాటలు, చేతలు, ఆలోచనలు భగవంతుని పాదాల దగ్గర పుష్పాలుగా పడాలి, అప్పుడు మనం భగవంతుని దయకు పాత్రులవుతాము. మీరు ఈ సృష్టికి ఏమైనా ఉపకారం చేయాలంటే అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో శాంతిగా ఉండండి, ఆత్మజ్ఞానాన్ని సంపాదించండి. అప్పడు మీ ద్వారా సృష్టికి జరిగే ఉపకారం ఎవడి వలన జరుగదు. జ్ఞాని యొక్క శాంతి కిరణాలు, కాంతి కిరణాలు

నదులు దాటుతాయి, సముద్రాలు దాటుతాయి, సృష్టి అంతా వ్యాపిస్తాయి, ఎక్కడో అమెరికాలో ఉన్నవాడిని కూడా పునీతం చేస్తాయి. అట్టిది జ్ఞానం యొక్క వైభవం.

సబ్జెక్టు వదిలేసి ఆ దేవుడు గొప్పవాడు, ఈ దేవుడు గొప్పవాడు, ఆ గురువు గొప్పవాడు. ఈ గురువు గొప్పవాడు అనుకోవటం ఎందుకు ఎనర్జీ వేస్టు. మనం అశాంతితో కాలిపోతూ ఉంటే ఎవడో గొప్పవాడు అయితే మనకు కలిసి వచ్చేది ఏమిటి? మీరు బాగుపడేవిధానం చూసుకోండి. మీ మనస్సుకు నచ్చిన మార్గంలో ప్రయాణం చేయండి, మీరు తరించటం ముఖ్యం. మీరు అవిద్యలో నుండి విడుదల పొందాలి. మీరు భక్తి పెంచుకొంటే పాపం నశిస్తుంది, విద్యను సంపాదించుకొంటే అవిద్య నశిస్తుంది. భక్తిని ఆరోజుకారోజు పెంచుకొంటూ ఉంటే మీ మనస్సులో ఎన్ని బలహీనతలు ఉన్నా, పెంట కుప్ప ఎంత ఉన్నా భక్తి అనే నిప్పురవ్వ పడితే ఆ పాపరాశి అంతా కాలిబూడిద అయిపోతుంది, వైభవం అంతా భక్తిలో ఉంది. మన స్వరూపం మనకు అందకుండా ఏవైతే గుణాలు అడ్డుగా ఉన్నాయో ఆ గుణాలను భక్తి కాల్చిబూడిద చేస్తుంది, అది భక్తి యొక్క వైభవం. పులి దగ్గరకు మేకలు, దున్నపోతులు, ఆవులు ఏమీరావు. అలాగే భక్తి అనే పులి మన దగ్గర ఉంటే వాసనలను గెంటినా మన దగ్గరకు రావు. తీగ ఏవిధంగా అయితే చెట్టును అంటిపెట్టుకొని పాకుతుందో అలాగ భగవంతుని అంటిపెట్టుకొని పాకండి. పరమేశ్వరుడిని లేక పరమేశ్వరిని ఆధారంగా పెట్టుకొని మీ మనస్సు పాకితే మనస్సు నశిస్తుంది. నిజమైన జ్ఞాని మిమ్మల్ని ఇరుకున పెట్టడు, మీరు బాగుపడటం ముఖ్యం. జీవకోటి రూపంగా కనిపించేది పరమాత్మే. అయితే మీ గుణాలు వేరు, నా గుణాలు వేరు, మీ దేహం వేరు నా దేహం వేరు. లోపల ఉన్న వస్తువును చూసే శక్తి మనకు లేక మీరు వేరు, నేను వేరు అని మనకు అనిపిస్తోంది. ఈ గుణాలు, అలవాట్లు నిజంకాదు, మనకు తెలియక కల్పించుకొన్నాము. ఇప్పడువాటి వలన వచ్చే నష్టం మనకు తెలుస్తోంది. వాటిని పోగొట్టుకోవటానికి సాధన చేస్తున్నాము. సాధన అంటే అది మనం తెలియక తెచ్చిపెట్టుకొన్నాము, ఇప్పడు తెలుసుండి వాటిని పోగొట్టుకోవాలి.

కొంతమంది ఎంతో సహనంగా ఉంటారు. ఇంట్లో మనుషులతో పేచీలు, బాధలు, ఆర్థికంగా బాధలు ఇలాంటి మనుషుల మధ్యన, పరిస్థితుల మధ్యన ఎంతో సహనంగా ఉండే పుణ్యాత్ములను నేను చూసాను. వారు నేచురల్‌గా, నార్మల్‌గా ఉంటారు, సహనంగా ఉన్నామని కూడా వారికి తెలియదు, మనకంటే ముందు అటువంటి వారిని జ్ఞానంతో అలంకరిస్తాడు. మనం అహంకారాన్ని సంతృప్తి పరచుకోవటం కోసం పనిచేస్తున్నామా లేక ఈశ్వరార్పణంగా

పని చేస్తున్నామా అనేది సర్వసాక్షి చూస్తూ ఉంటాడు. మనం అబద్ధపు మాటలు చెప్పినా సర్వసాక్షిగా అంతా తెలుస్తూ ఉంటుంది, దానిని బట్టి అనుగ్రహిస్తాడు. మన మాటలకు మోసపోయేటంత అమాయకుడు కాదు దేవుడు. గుణాలకు లోబడితే జీవుడు, గుణాలను అతిక్రమిస్తే దేవుడు. గుణాలకు, వాసనలకు లోబడకుండా ఉండటం కోసమే ఈ సత్సంగ సమావేశాలు. మీరు మాకు బహుమానంగా ఇవ్వవలసింది ఒక్కటే. ఇక్కడ శ్రవణం చేసిన మాటలను, ఇంటిదగ్గర శ్రద్ధగా మననం చేసుకొంటూ, సాధన చేసుకొంటూ బాగుపడటమే మీరు మాకు ఇచ్చే బహుమానము. మీరు శాంతిగా లేరు అనుకోండి, సుఖంగా లేరు అనుకోండి, నాకు కిరీటం తెచ్చిపెడితే ఆ కిరీటం నేను ఏమి చేసుకొంటాను మీరు పని దొంగలు అవ్వకూడదు. చేతిలో ఉన్న పనిని వదిలేస్తే జ్ఞానం వస్తుంది అనుకొంటున్నారు జ్ఞానం రాదు నూటికి నూరు పాళ్ళు సోమరితనం వస్తుంది. కర్మతోటి ఈశ్వరుని ఆరాధించగా ఆరాధించగా ఆయన దయ వలన కర్మ మనలను విడిచిపెడుతుంది కాని కర్మను మనం విడిచిపెట్టలేము. అన్నం తినటం, గాలిపీల్చుకోవటం, బట్టలు కట్టుకోవటం ఇది అంతా కర్మే. ఈ పనులు ఎంత సహజంగా జరుగుతున్నాయో అలాగే ఈశ్వరానుగ్రహం కోసం మీరు చేసే పనులు కూడా అంత సహజంగా జరగాలి. అప్పుడు కర్మ మనలను విడిచిపెడుతుంది.

దేవుడు పూజగదిలో ఉన్నాడు, గుడిలో ఉన్నాడు అని మనం అనుకొంటాము. అలా అనుకోవటం దేవుడిని అవమానపరచినట్లే. ఇందుగలడు అందులేడు అని సందేహము వలదు చక్రి అన్నాడు ప్రహ్లాదుడు అంటే ఆయన అంతటా ఉన్నాడు. నారాయణుడు లేని చోటు అంటూ లేదు. నారాయణుడే ఈ సృష్టిగా కనిపిస్తున్నాడు. మనంకాని శరీరం, మనంకాని పదవులు, మనం కాని ఆస్తులు, ఇలా మనం ఏదైతే కాదో వాటిని మనం అనుకొని వాటితో తాదాత్మ్యం పొందటం వలన మనం కుళ్ళిపోతున్నాము. మీకు సంపద ఉంటే ఉండవచ్చు అది మీరు అనుకోవద్దు. మీకు వందకోట్లు ఉన్నా మీ శరీరం చనిపోయినప్పుడు వంద పైసలు కూడా మీ కూడా రావు. మీరు చనిపోవటం ఖాయం అనుకొంటే మీ ఇంట్లోనివారే మీ జేబులో ఉన్న డబ్బులు, మీ వంటి మీద ఉన్న నగలు, తాళాలు అన్నీ కూడా లాగేస్తారు. ఇదీ ప్రపంచం యొక్క పోకడ. తరువాత పనికిరాని శరీరాన్ని తీసుకొనివెళ్ళి కాల్చేయమంటారు. మీ కూడా తీసుకొని వెళ్ళటానికి గుండు సూది కూడా రాదు. మనకు ఒక రూపాయి ఆదాయం వస్తోంది అనుకోండి. అందులో పది పైసలు ఎవరికైనా సహకరిస్తున్నాము అనుకోండి. తొంబై పైసలు మనం అనుభవిస్తున్నాము అనుకోండి. మనం ఏమనుకొంటున్నాము అంటే ఈ తొంబై పైసలు మనం

అనుభవిస్తున్నాము, పది పైసలు పాడుచేస్తున్నాము అనుకొంటాము. కాని జరిగేది ఏమిటంటే మరణానంతరం ఈ పది పైసలు మనకు సొమ్ము, 90 పైసలు దుమ్ము. ఇవి అన్నీ నగ్నసత్యాలు. డబ్బు లేనివారు కష్టపడి డబ్బు ఎలా సంపాదించుకొంటున్నారో అలాగే భక్తి లేనివారు భక్తిని సంపాదించుకోవటానికి ఎంతోకొంత శ్రమపడకుండా భక్తిరాదు. మనం భక్తిమార్గమో, కర్మమార్గమో, ధ్యానమార్గమో ఏదో మార్గంలో ప్రయాణించి అహంభావనను పోగొట్టుకోవాలి. రోగం ఉన్నవాడికి మందుకాని రోగం లేనివాడికి మందుతోపనిలేదు. అలాగే మనకు గుణాలు ఉన్నాయి కాబట్టి మనకు యోగం అవసరం, లేకపోతే యోగం అక్కరలేదు. నిరాకారుడికి, నిర్గుణుడికి సాధన ఎందుకు? వారికి సాధన అక్కరలేదు. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసిన మనస్సు వెళ్ళి హృదయంలో లయమవ్వాలి. నిష్కామంగా మీరు సత్కర్మ చేస్తారు అనుకోండి, మీరు అందరూ దేవతలు అయిపోతారు. ఈ శరీరం ఉండగానే గుణాలకు దూరంగా ఉండే శక్తిని సంపాదించు, దానికి అమ్మవారి అనుగ్రహం ఉండాలి. భక్తి మార్గంలో ఉన్నాను నాకు అనుగ్రహం తొందరగా వస్తుందా, లేటు అవుతుందా అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. నీవు శరణాగతి చెందాక ఇటువంటి సందేహాలు రాకూడదు అన్నారు భగవాన్. నీవు చేసేపని చెయ్యి. ఈ జన్మలో వస్తుందా, వచ్చే జన్మలో వస్తుందా ఆ గొడవలు నీకు వద్దు. ఆ గొడవలు నీ మనస్సులోనికి వస్తున్నాయి అంటే నీకు భక్తి లేదని అర్థం, నీవు శరణాగతి చేయలేదని అర్థం.

మీరు పనిచేయటానికే పనికివస్తారు, కర్మఫలం మీ చేతిలో లేదు. మీ చేతిలో ఉన్న పనిని మీరు చేయండి, నా చేతిలో ఉన్న పని గురించి అసలు ఆలోచించవద్దు. నేను మర్చిపోతానని బెంగపెట్టుకోవద్దు. జీవుడికి మరుపుకాని భగవంతుడికి మరుపు ఏమిటి? కర్మఫలం ఎప్పుడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి ఆ ముహూర్తం నేను పెట్టుకొంటాను, ఆ గొడవ మీకు వద్దు అని పరమాత్మ చెపుతున్నాడు. తల్లితండ్రులను చూడకూడదు, వారికి ఉన్న 100 ఎకరాలు మనకు వచ్చేయాలి. వాళ్ళ ఆస్తి అంతా మనకు రావాలి, బంగారం రావాలి, వాళ్ళవి అన్నీ ఆశిస్తాము కాని వారిని చూడకూడదు. ఇదీ మన పరిస్థితి. ఎవరైతే అన్యచింతన లేకుండా నిరంతరం నన్నే స్మరిస్తున్నారో నా రూపాన్ని, నా పాదాలను ఎవరైతే అంటిపెట్టుకొని ఉన్నారో, ఎవరైతే నాకోసం జీవిస్తున్నారో వారి యోగ క్షేమాలను చూసే బాధ్యత నాది అని పరమాత్మ చెప్పాడు. యోగం అంటే లేనిది ఇవ్వటం, క్షేమం అంటే ఉన్నది పోకుండా చూడటం. ఇది మన మనస్సు నమ్మదు ఎందుచేతనంటే మనం బుద్ధిమంతులం కాదు. పని చేసినా చేయని వాడిలాగ ఉంటాడు, వాడు బుద్ధిమంతుడు, మనం పని చెయ్యకపోయినా పనిచేసాము అని లోకం అంతా చెప్పకోవాలి.

మనం బుద్ధిమంతులం కాదు. ఎవడైతే కర్తలేని కర్మ చేస్తాడో వాడు బుద్ధిమంతుడు. ఆత్మజ్ఞాని బుద్ధిమంతుడు. ఆత్మజ్ఞానికి కర్తృత్వం లేదు, భోక్తృత్వం లేదు. డబ్బులేని వారు అందరూ డబ్బు వస్తే సుఖపడిపోతాము అనుకొంటారు, మన మనస్సుకు అలా అనిపిస్తుంది. చివరకు ఆ డబ్బు వారికి ముళ్ళకిరీటం కింద తయారవుతుంది. వాడికి పెట్టాడనివీడు, వీడికి పెట్టాడని వాడు అనుకొని చివరకు ఎవరూ వీడిని చూడరు. డబ్బున్నవాడు అందరికీ జడుస్తూ ఉంటాడు. డబ్బు బ్యాంకులో వేసుకొంటే తెలిసిపోతుందని భయం, స్నేహితులకు బంధువులకు ఇస్తే వారు తినేస్తారని భయం. ఇంట్లో వారిని చూసినా వాడికి భయమే, ఆ డబ్బును తొందరగా విడిచిపెట్టడు, ఎందుచేతనంటే ముందుగా ఇంట్లో వారికి ఇచ్చేస్తే మనం మంచాన పడితే వారు చూడరు అని భయం. ఈ దేశం అంతా మీకు పట్టారాసి ఇచ్చేసినా మీకు దుఃఖం నశించదు ఎందుచేతనంటే కర్తృత్వం ఉన్నంతకాలం మిమ్మల్ని దుఃఖం విడిచిపెట్టదు. శాస్త్రిగారు మనకు 18 నెలలు ప్రధానమంత్రి చేసారు, కొన్ని సంవత్సరాలు మంత్రిగా చేసారు, ఆయన చనిపోతే భార్యకు తినటానికి డబ్బు లేదు, వారు దేవతలు. దేశంలో ఉన్న డబ్బు అంతా ఆయన చేతిలో ఉన్నా ఆయనకు ఆకర్షణ కలుగలేదు. మనకు ఆకర్షణ ఉన్నప్పడు దేవుడు అసత్యం, లోకం సత్యం అనిపిస్తుంది. ఏవిధమైన ఆకర్షణ లేదు అనుకోండి దేవుడు సత్యం, లోకం అసత్యం అని మనకు తెలుస్తుంది.

దేహాభిమానం ఉన్నవాడు కర్తృత్వం లేకుండా ఉండలేడు. కర్తృత్వం ఉన్నంతకాలం ఎవడినీ దుఃఖం విడిచిపెట్టదు. హృదయంలో ఉన్న సత్యపదార్థాన్ని అనుభవైకవేద్యం చేసుకొన్నప్పడు కర్తృత్వం నశిస్తుంది. ఎందుచేత నశిస్తుంది అంటే దానికి కర్తృత్వం లేదు. అప్పటివరకు ఏ జీవుడిని కర్తృత్వం విడిచిపెట్టదు. కష్టాల నుండి బయటపడటానికి భగవంతుడిని ప్రార్థించినా వాడూ భక్తుడే, డబ్బు కోసం ఇబ్బంది పడి ప్రార్థించినా వాడూ భక్తుడే, జ్ఞానం కోసం ప్రయత్నం చేసేవాడు భక్తుడే. జ్ఞాని కూడా భక్తుడే, వాడు నిజమైన భక్తుడు, వాడు ఉన్న పదార్థాన్ని ఉన్నట్లుగా దర్శిస్తాడు. మిగతావారు కూడా భక్తులేగాని క్వాలిటీలో తేడా, అది జ్ఞానం యొక్క వైభవం. మనస్సును ఆపుచేయటానికి ఎక్కువ కష్టపడనక్కరలేదు. భగవంతుని పట్ల భక్తి పెరుగుతోంది అనుకోండి మనస్సు యొక్క చాపల్యం దాని అంతట అదే తగ్గిపోతుంది. మీ ఇంటి దగ్గర మీ పిల్లలు చెప్పే మాటలు వింటున్నారు కదా అలాగే నేను పండితుడిని కాకపోయినా భగవద్గీత గురించి నేను చెప్పే మాటలు కనీసం వినండి అని జ్ఞానేశ్వర్ అనేవాడు, వాడి నిరహంకారం చూడండి. లోపల ఉన్న పరమాత్మే జీవుడిగా, లోకంగా కనిపిస్తున్నాడు. మనం జీవుడు వేరు, లోకం వేరు, పరమాత్మ వేరు అనుకొంటున్నాము. కాని ఇన్ని రూపాలుగా కనిపించేది పరమాత్మే. ఈ వాక్యం వాస్తవము,

ఈ వాక్యం వాస్తవము. మీ ఇంట్లో బిడ్డలు చెపుతూ ఉంటే మీరు ఎలా వింటున్నారో అలాగ ఈ బిడ్డ చెప్పేమాట కూడా వినండి అంటాడు జ్ఞానేశ్వర్. ఉన్న వస్తువు ఒక్కటే అయినప్పుడు వేరుబుద్ధి ఎందుకు కలుగుతోంది? ఈ శరీరం వలన, ఉపాధి వలన వేరుబుద్ధి కలుగుతోంది. సాధన చేసి ఉపాధిబుద్ధిని నశింపచేసుకొనేవరకు అందరిలో ఉన్న నారాయణుడు మనకు వ్యక్తం కాడు. ఆయన వ్యక్తమైతేగాని ఈ జననమరణ చక్రంలో నుండి మనం బయటకు రాలేము.

ఎవరో నిన్ను బంధిస్తున్నారు అనుకోవద్దు, నీ కర్తృత్వబుద్ధే నిన్ను బంధిస్తోంది. అందులో నుండి బయటకు వస్తే బంధం లేదు, మోక్షం లేదు. కర్తృత్వం వలన నేను బంధంలో ఉన్నాను, మోక్షం పొందాలి అనుకొంటున్నాను. బంధమోక్షములను కల్పించేది కర్తృత్వబుద్ధి. కర్తృత్వబుద్ధిని విడిచిపెట్టేస్తే వాడికి బంధం తాలుక, మోక్షం తాలుక చింతన ఉండదు, అది చివరిస్థితి. కర్తృత్వబుద్ధి పోయినవాడికి కోరిక లేదు, ద్వేషం లేదు. పుండు అంతా కర్తృత్వబుద్ధిలోనే ఉంది. నీ ప్రయత్నం నీవు చేసుకొంటూ ఒక్క దేవతాపురుషుని అనుగ్రహం సంపాదిస్తే కర్తృత్వబుద్ధి నశిస్తుంది. అప్పుడు బంధంతోటి, మోక్షంతోటి సంబంధం లేని ఆత్మసుఖం, ఆత్మశాంతి నిన్ను వరిస్తాయి. తాడు పాముగా కనిపించినప్పుడు పాము తాలుక వికారాలు అన్నీ నీకు కనిపిస్తాయి. తాడులో ఏ వికారాలు లేవు అంటే అక్కడ ఉన్న వస్తువులో ఏ వికారాలు లేవు. అది ఉన్నది ఉన్నట్లుగా కాకుండా మరొక వస్తువుగా కనిపిస్తోంది కాబట్టి నీకు భయం వస్తోంది - లేని దానిని ఆరోపించుకోవటం వలన ఈ గొడవ అంతా వస్తోంది. అలాగే బ్రహ్మమును బ్రహ్మముగా చూడలేకపోవటం వలన లోకంగా కనిపిస్తోంది. లోకంగా కనిపించేటప్పుడు లోకం తాలుక వికారాలు రాగద్వేషములు వచ్చేస్తున్నాయి. ఇవి అన్నీ బ్రహ్మంలో లేవు, మీరు ఊహించుకోవటం వలన వచ్చే పోరాటమే ఇది అంతా కాని బ్రహ్మంలో ఇవి ఏమీ లేవు. తాడు పాముగా కనిపించటం వలన ఇంత గొడవ ఎలాగ వస్తోందో బ్రహ్మం లోకంగా కనిపించటం వలన సంసారం అంతా వస్తోంది. తాడు తాడుగా ఎంతకాలం అయితే గోచరించలేదో అంతకాలం అది పాముగానే కనిపిస్తుంది. ఉన్న వస్తువు ఉన్నట్లుగా తెలిసేవరకూ లేనివస్తువు ఉన్నట్లుగా కనిపిస్తుంది. ఇది గురువు అనుగ్రహం వలన పోవాలిగాని, మీ సాధన వలన కత్తులుకటారుల వలన ఇది పోదు. సబ్జెక్టు అర్థం చేసుకోవటంలో పొరపాటు పనికిరాదు. మీరు పొరపాటుగా అర్థం చేసుకొంటే ఆ పొరపాటు మనలను జననమరణ చక్రంలో తిప్పేస్తుంది, ప్రకృతి మనలను విడిచిపెట్టదు. అందువలన బహుజాగ్రత్తగా ఉండండి. సజ్జనులతోటి, సత్పురుషులతోటి సహవాసం విడిచిపెట్టవద్దు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| నవంబర్ | 11 | పాలకొల్లు, శ్రీ పెన్మెత్స సత్యనారాయణరాజు సూర్యపద్మావతి క్షత్రియ సంక్షేమ పరిషత్ కళ్యాణ మండపం |
| నవంబర్ | 15 | జువ్వలపాలెం, గీతా భవనం |
| నవంబర్ | 18 | తణుకు, క్షత్రియ కళ్యాణ మండపం |
| నవంబర్ 21 నుండి 27 వరకు | | అరుణాచలం క్యాంపు |
| నవంబర్ | 28 | పాతాళ మెరక |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

- Mahabharatha



**ది॥ 23-09-2007న హైదరాబాదు త్యాగరాయ భవన్‌లో జరిగిన సభలో సద్గురు శ్రీ నాన్నగారితో రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీ శివరామకృష్ణగారు మరియు పశ్చిమగోదావరి జిల్లా మాజీ కలెక్టరు శ్రీ డి. రామకృష్ణగారు**

## అన్నీ మరచిపో - ఆత్మను మాత్రమే కోరుకో - పూర్ణకాముడు అవుతావు

ఉన్న సత్యమేదో సరిగా తెలియక వివిధ ప్రత్యేక రూపాల సముదాయంతో ఈ మహావిశ్వం ఉన్నట్లుగా గుర్తించబడుతున్నది. దేహం మొదలుకొని మనస్సు వరకూ గల జడమైన ఉపాధులు అంతా విచారించి చూస్తే స్వతంత్రమైన "నేను" అనే దానికి స్థానం ఎక్కడా లభించటం లేదు. అంతా చైతన్య వైభవం వల్లనే జీవిస్తున్నాయి. మన అభిరుచులు, అనుభూతులు అన్నీ మనస్సు కల్పించుకొన్నవే, అన్నీ అసత్యాలే. దుఃఖ మిశ్రితమైన సుఖాలే. ఆత్మ ఒక్కటే సత్యం, ఈ సత్యాన్ని శాస్త్రాలు, గురువులు ఎంత బోధించినా సంస్కారాల బలం వల్ల మనస్సు నమ్మినట్లు నటిస్తున్నది కాని నమ్మటంలేదు. మనో కల్పనలు అన్నీ మర్చిపోలేక పోతున్నాము. జీవితం దుఃఖంగా భారంగా సాగుతున్నది. పులులతో కూడిన కీకారణ్యంలో జింకలకు మరణం ఖాయమైనట్లే విషయ వికారాలతో కూడిన సంసార మహారణ్యంలో మానవునకు మరణం నిశ్చయమైనట్లే. కోరికే బంధం అదే సంసార వృక్షానికి అంకురం. దాన్ని నిరంతరం గుర్తిస్తూ యధాశక్తితో వాటిని నశింపు చేసుకొనే పని కన్న గురుపాద పంచికంపై దృష్టిని నిలిపితే తేలికగా అన్నీ మర్చిపోతాము. భగవాన్ "అనవసరపు విషయాలను ఎందుకు తలచుకొంటావు, నీవు ఆత్మవు" అనేవారు. వివేకవైరాగ్యాలు పూర్ణంగా కలిగే వరకూ అది పైకి లేస్తూనే ఉంటుంది. అప్రమత్తత లేని యజమాని ఇంట్లోని వస్తువులనే దొంగలు దోచుకొని పోతారు. ఒక్క క్షణం కోరికలతో గడిపితే మన సాధనా బలాన్ని కోరికలు దోచుకొనిపోతాయి. అదే కాలంలో వేలాది భ్రమలు, భ్రాంతులు భద్రంగా మనలో చేరిపోతాయి. ఆత్మకంటే వేరే ఏదైనా వస్తువు ఉంటే దాన్ని మనం కోరుకోవచ్చును. ఆత్మజ్ఞానం కలగనంతకాలం రెండవ వస్తువు కనిపిస్తుంది కోరుకొంటాము. ముత్యపు చిప్పలో వెండి వలె విచారించి చూస్తే అది ప్రయోజనకారి కాదు అందు ఏదీ లభించదు. దృశ్యము మిధ్యగా తెలుసుకొనుటచే మనకు హాని కలుగదు. వికారం గల ఆత్మను అనుభూతి పొందాలంటే గురు రూపాన్ని ప్రేమతో చూడు భ్రాంతులు, భ్రమలు అన్నీ మర్చిపోతాము. శ్రీ నాన్నగారు "మీ గురువును రోజూ ఐదు నిమిషాలు తలచుకొంటే రోజు అంతా నిన్ను స్మరిస్తాడు మరిచిపోవలసిన విషయాలు జ్ఞాపకం పెట్టుకొంటే జ్ఞాపకం పెట్టుకోవలసిన ఆత్మ విషయం మరచి దుఃఖాలపాలు అవుతున్నావు" అన్నారు. అనంత సత్యం గురు ఉపాధిలో వ్యక్తమై ఉందని ప్రేమిస్తే అదే మనమై అన్ని కోరికలు నెరవేరిన వారమై అన్నీ మర్చిపోతాము. ఆత్మగా ఉంటాము.

**- సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం